S TV SAMAYAM

epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 75 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 30 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



జిల్లాల పునర్విభజనకు

# కేబినేట్ ఆమోదం

కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు

- రాష్ట్రంలోని 28కి పెరగనున్న జిల్లాల సంఖ్య
- మదనపల్లె కొత్త జిల్లాలో రాయచోటి విలీనం
- రాజంపేటను కడప జిల్లాకు కేటాయింపు
- రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు కేటాయింపు
- గూడూరును తిరుపతి నుంచి నెల్లూరులో విలీనం
- రాయచోటి మార్పుపై కన్నీరు పెట్టుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి :** జిల్లాల ఏర్పాటు, పునర్విభజనలపై ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయంతో కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది. దీనికి సంబంధించి తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మిగతా 5 లో

# అసెంబ్లీ వాయిదా

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం.. మళ్లీ జనవరి 2కు..



## తొలి రోజు వాడీవేడిగా చర్చలు

- హాజరైన సీఎం రేవంత్, విపక్షనేత కేసీఆర్
- వచ్చిన 3 నిమిషాలకే సభ నుంచి వెళ్లిపోయిన కేసీఆర్
- ముందుగా దివంగత నేతలకు సంతాప తీర్మానాలు
- కేసీఆర్‌కు నమస్కరించి ఆరోగ్యంపై సీఎం వాకబు
- అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

"తెలంగాణ శాసనమండలి వాయిదా పడింది. వచ్చే ఏడాది జనవరి 2వ తేదీ వరకు వాయిదా పడింది. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం 10.30 గంటలకు తొలిరోజు మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. అనంతరం సంతాప తీర్మానం ప్రకటించి, మాధవరం జగపతిరావు, అహ్మద్ పీర్ షబ్బీర్‌లకు మండలి నివాళులర్పించి సంతాపం తెలిపింది. సమావేశాల్లో భాగంగా పలు ఆర్డినెన్స్‌లు, డాక్యుమెంట్లను మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు మండలిలో ప్రవేశపెట్టారు. అనంతరం మండలి సమావేశాలను జనవరి 2వ తేదీకి వాయిదా వేశారు."

**హైదరాబాద్, డిసెంబర్ 29:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. మిగతా 2 లో



# యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

ప్రతి గడపకు చేరేలా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్

అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

ఇవాళ తెలంగాణ గర్వించదగ్గ రోజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టాం అన్నారు. వివరాలు 3లో..

## మరో ముగ్గురు సలహాదారుల నియామకం

మంతెన, కార్టూనిస్ట్ శ్రీధర్, సీతారామాంజనేయ ప్రసాద్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురిని సలహాదారులుగా నియమించింది. ప్రముఖ ప్రకృతి వైద్య రంగ నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజును ఏపీ ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది. డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా ఎంతో మందికి సేవలు అందించారు. ఉండవల్లి కరకట్టపై ప్రకృతి చికిత్సాలయం పేరుతో ఆసుపత్రి ఏర్పాటు చేశారు. విజయవాడ, నరసాపురంలోనూ ఆరోగ్యాలయం మిగతా 5 లో



## ఉద్యోగుల పీఆర్సీ ఏమైంది?

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా దక్కడం లేదు

హరీష్ రావు విమర్శలు

.. వివరాలు 2లో



## కేసీఆర్ ఎందుకు వెళ్లారో.. ఆయననే అడగండి

- వచ్చే సమావేశాల్లోపు మండలి భవనం పూర్తి
- పార్లమెంట్ సెంట్రల్‌హాల్ మాదిరిగా సెంట్రల్ హాల్
- చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

శాసనసభలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చి త్వరగా వెళ్లిపోవడంపై రేవంత్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ వెంటనే ఎందుకు వెళ్లారన్నది ఆయననే అడగాలని చమత్కరించారు.

## బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరుకు అన్యాయం

- పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్లక్ష్యం
- సాగునీటి జలాలపై చర్చలో మండిపడ్డ మంత్రి ఉత్తమ్

.. వివరాలు 2లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్‌ఎస్‌లో డోర్స్ క్లోజ్



- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ
- అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీలపై వెనకడుగు
- తెలంగాణ తెచ్చిన నేతగా కేసీఆర్‌ను గౌరవించాలి
- మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్



## అమెరికాలో రోడ్డు ప్రమాదం

గార్లకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం

## అఖండ-2 కనువిప్పు కావాలి

బోయపాటితో కలసి మూవీని వీక్షించిన బండి సంజయ్

.. వివరాలు 3లో



14 ఏండ్ల తర్వాత

## హంతకుడికి మరణ శిక్ష



మహిళా హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు తీర్పు

## సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

సినీనటి మాధవీలతపై సరూర్‌నగర్‌లో కేసు నమోదు



## తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం

తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చివేశారని కౌశిక్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చేశారని పేర్కొన్నారు.

.. వివరాలు 2లో

# అమెరికాలో రోడ్డు ప్రమాదం





### గార్లకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం

**మహబూబాబాద్, డిసెంబర్ 29:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఘాట్‌రోడ్డులో జరిగిన కారు ప్రమాదంలోఇద్దరు యు-వతులు దుర్మరణం చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్‌కి బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# కేసీఆర్ ఎందుకు వెళ్లారో.. ఆయననే అడగండి

### వచ్చే సమావేశాల్లోపు మండలి భవనం పూర్తి

### పార్లమెంట్ సెంట్రల్‌హాల్ మాదిరిగా సెంట్రల్ హాల్

### చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 29:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలీదని.. ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు. అలాగే ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో ఏం మాట్లాడారని వారు అడిగారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్, తాను మాట్లాడుకున్నది మీకెందుకు చెబుతామని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం 5 నిమిషాల్లోనే కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ప్రాంగణంలో శాసనమండలి భవనం పునర్నిర్మాణ పనులను వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు పూర్తిచేయాలనుకుంటున్నామని చెప్పారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరి సెంట్రల్ హాల్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో ఇక్కడికి యాక్సెస్ ఉంటుందని, మాజీ ఎమ్మెల్యేలకు కూడా సెంట్రల్ హాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని చెప్పారు. ఇక.. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో సీఎం భేటీ అయ్యారు. అసెంబ్లీలో తమ స్టాటజీపై నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేయనున్నారు. బీఏసీ సమావేశంలో అసెంబ్లీ పనిదినాలను బీఏసీ ఖరారు చేయనుంది.

# కొండగట్టుకు రానున్న పవన్

### 3న డిప్యూటీ సీఎం షెడ్యూల్ ఖరారు ● అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



**జగిత్యాల, డిసెంబర్ 29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

### సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ ● సరూర్‌నగర్ పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, డిసెంబర్ 29:** ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారు పెట్టిన పోస్టు వల్ల ప్రజల భావోద్వేగాలకు నష్టం జరిగిందని ఎఫ్‌ఐఆర్‌లో ప్రస్తావించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాధవీలతతో పాటు మిగతా యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. ఈ కేసులోని ఇతర వివరాలను పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో వారి సోషల్ మిడియా ఖాతాలపై నిఘా పెట్టినట్లు సమాచారం. సోషల్ మిడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం



మొదటి పేజీ తరువాయి

సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు. తొలిరోజు సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. శాసనసభ, మండలి ఎన్నిరోజులపాటు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనం అయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. కేసీఆర్ సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు. దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి ఆర్ తిరుపతి అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

# పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం

- పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్లక్ష్యం
- డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు
- పైగా 90శాతం పనులు పూర్తయ్యాయనే దుష్ప్రచారం
- సాగునీటి జలాలపై చర్చలో మండిపడ్డ మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, డిసెంబర్ 29:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేతకానితనాన్ని మంత్రి ఎండగట్టారు. 2015లో ఈ ప్రాజెక్టు కోసం జీవో జారీ చేసినప్పటికీ, కేంద్ర జల సంఘానికి డీపీఆర్ సమర్పించడానికి నాటి ప్రభుత్వానికి ఏడేళ్ల మూడు నెలల సమయం పట్టిందని ఎద్దేవా చేశారు. ఆశ్చర్యకరంగా, డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు చేశారని, ఇది వారి పాలనలోని అస్తవ్యస్త విధానాలకు నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టి, దాని సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపారని ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా, ప్రాజెక్టు పనులను ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా చేయాలని నాటి రాజకీయ పెద్దలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. అసలు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 70,000 కోట్లకు పైగా ఉంటే, బీఆర్ఎస్ హయాంలో జరిగింది కేవలం రూ. 27,000 కోట్ల పనులు మాత్రమే. ఇది 90 శాతం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి వాటిని కూడా తొమ్మిదిన్నరేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తమ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతోనే పూర్తి చేసి తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తాము అధికారంలోకి వచ్చాక 11 పంపుల ఇన్‌స్టాలేషన్ పూర్తి చేశామని, ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా బయటపెడతామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తాము 90టీఎంసీలు డిమాండ్ చేశామని చెప్పుకొచ్చారు. తాము 45 టీఎంసీలు మాత్రమే అడిగామని హరీశ్‌రావు దుష్ప్రచారం చేశారన్ని ÷ర్ అయ్యారు. అబద్దాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్దాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిడ్డారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్‌ను అవుటాఫ్ కాంటెక్స్ట్ తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తానని ప్రశ్నించారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని.. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్‌కు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్‌లైన్ పెట్టామని పేర్కొన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ నేతల చేతకాని తనాన్ని తమపై రుద్దవద్దని హితవు పలికారు. వారు ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సాగునీటి జలాలపై డీపీఆర్‌ను కేంద్రానికి పంపడానికి ఏడేళ్ల సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. డీపీఆర్ పంపే సమయానికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు..అన్యాయం చేస్తున్నామంటూ బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

# తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

### అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం

**హైదరాబాద్, డిసెంబర్ 29:** హుజూరాబాద్‌లో పెద్ద ఆయకట్టు కొట్టుకుపోయిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. రిపేర్ చేస్తే దాదాపు ఏడు వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని పేర్కొన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాల సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చివేశారని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చేశారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతుంటే ఆయన ప్రసంగానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం కల్పించారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే.. దీనిపై న్యాయ విచారణ చేపడతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓటరు పట్టం కట్టాడు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల పాటు విచారించిన ఈ కమిషన్.. తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అయితే మేడిగడ్డ పిల్లర్లు కృంగడానికి బాంబుతో పేల్చడమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది.

# ఉద్యోగుల పీఆర్సీ ఏమైంది?

### రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా దక్కడం లేదు ● హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,డిసెంబర్ 29:** బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇయ్యాల్సిన పీఆర్సీ గానీ, డీఏలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కుసంబంధించిన ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టలేదని హరీష్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామిని కూడా నెరవేర్చలేదని హరీష్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య బాగాలేక ఎంతో మంది చనిపోయారని మాజీ మంత్రి గుర్తు చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించమని కోర్టుకు వెళ్లినా ఈ సర్కారారు వారిపట్ల కనికరం చూపించలేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రథ చక్రాల్లాంటివారు, వారు సంతోషంగా ఉంటేనే ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగే అవకాశముంటుందని హరీష్ అన్నారు. కానీ.. ఇవాళ ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లకు రావలిసిన బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. ఇవాళ ఉద్యోగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగుకలకు పీఆర్సీ ఇవ్వలేదు. గతంలో కేసీఆర్ హయాంలో ఒకసారి 39, మరోసారి 43 శాతం పీఆర్సీ ఇచ్చిన విషయాన్ని హరీష్‌రావు అసెంబ్లీ వేధికగా గుర్తుచేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)ను కూడా అమలు చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ తదితర బకాయిలన్నీ కూడా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన అన్నారు. డబ్బులు లేక సరైన వైద్యం అందక దాదాపు 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సుమారు 15వేల మంది ఉద్యోగులు రిటైరైతే వారందరికీ అందాల్సిన బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టకుండా ఇచ్చామని హరీష్ తెలిపారు. అదేవిధంగా సీపీఎస్ పెన్సన్ స్కీమ్‌ను ఓపీఎస్‌గా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామి ఇచ్చిందని, అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, ఎప్పటిలోగా ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలు చేస్తారో చెప్పాలని హరీష్ అడిగారు. గత రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్రప్రభుత్వం కట్టాల్సిన కాంట్రీబ్యూషన్ డబ్బులు కూడా కట్టకుండా వాటిని దారి మళ్లిస్తున్నారని, సీపీఎస్ కట్టకుండా, ఓపీఎస్ అమలు చేయకపోవడంతో రెండు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దయచేసి సీపీఎస్ కాంట్రిబ్యూషన్ కట్టమని, ఓపీఎస్‌ను త్వరగా అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీష్ అన్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్



- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ
- అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీలపై వెనకడుగు
- తెలంగాణ తెచ్చిన నేతగా కేసీఆర్‌ను గౌరవించాలి
- మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 29:** అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 40 శాతం ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే దూషిస్తున్నారు. ఆయన తిట్లు నాకు దీవెనలు. నన్ను తిడితే పడతాను కానీ.. కేసీఆర్‌ను అంటే ఊరుకునేది లేదు. ఆయనకు మంచి పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పనులు చేయట్లేదు. కాల్వల కోసం పిలిచిన టెండర్లను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారని కేటీఆర్ అన్నారు. పార్టీని వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదన్నది తన అభిప్రాయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆర్ఎస్‌ను కాదని భాజపాలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారు. 10మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం?వారి విషయంలో సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయి. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదు. కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉంది. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

- ప్రతి గడపకు చేరేలా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్'
- అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 29:** ఇవాళ తెలంగాణ గర్వించదగ్గ రోజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టాం అన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదు.. ఇది మన యువత మేధస్సుకు, సృజనాత్మకతకు ఒక గొప్ప వేదికన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి, ముఖ్యంగా మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఎంట్రీలను చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రవీంద్ర భారతిలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి... రాష్ట్ర టూరిజం, కల్చరర్,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను ప్రకటించి,అవార్డులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి 3లక్షలు,రెండో బహుమతి 2లక్షలు,మూడో బహుమతి 1లక్ష.. షార్ట్ ఫిల్మ్,బతుకమ్మ వీడియో విభాగాలకు వేరు వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచారు. పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం సినిమాటోగ్రఫీ మంత్రిగా నాకు ఎంతో గర్వకారణం. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క యంగ్ ఫిల్మ్ మేకర్ కు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. గెలుపొందిన విజేతలకు నా ప్రత్యేక శుభాకాంక్షలు. మీ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు.. తెలంగాణ భవిష్యత్తును మీ కళాత్మక దృష్టితో మరింత గొప్పగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను గతంలో దిల్ రాజు నిర్మించిన బలగం సినిమా చూసాను.. ఇటీవల వచ్చిన 'దండోరా' సినిమా చూసాను..సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చేలా,హృదయానికి దగ్గరయ్యే విధంగా ఉన్నాయి అని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో సినిమాలు తీసుకోవడానికి లోకేషన్స్ పరంగా కూడా టూరిజం డెవలప్మెంట్ చేస్తున్నామని, దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఘాట్ రోడ్డు,అటవీ మార్గాన వెళ్లే బాధలు తప్పించేందుకు 8వేల కోట్లతో మన్ననూర్ - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నాం. ఇది సినిమా, షార్ట్ ఫిలిమ్స్ కు మంచి లొకేషన్ అవుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, :ఎఫ్‌డిసి చైర్మన్ సీహెచ్.ప్రియాంక,దర్శకులు హరీష్ శంకర్,తనికెళ్ళ భరణి,దశరథ్,రాహుల్ సిప్లిగంజ్,అశోక్ కుమార్,శ్రీలక్ష్మి,పీ.జీ. విందా,మంగ్లీ,సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తోపాటు పెద్ద సంఖ్యలో యువ దర్శకులు, కళాకారులు, సినీ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# దారితప్పిన వాళ్లకు అఖండ-2 కనువిప్పు కావాలి

**బోయపాటితో కలసి మూవీని వీక్షించిన బండి సంజయ్**




**హైదరాబాద్,డిసెంబర్ 29:** ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి 'అఖండ 2 -తాండవం' సినిమాను బండి సంజయ్ సోమవారం వీక్షించారు. 'అఖండ- 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లు ఉన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా చూపించిన సినిమా అఖండ- 2. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే... ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవారే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ -2 తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడుపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలని అఖండ-2 చెబుతోంది' అని బండి సంజయ్ ప్రశంసించారు. 'భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం. కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే.... సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే.. ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన దృశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్‌ను పరిపాలిస్తున్నారు కాబట్టే వ్యాక్సిన్‌ను అందించగలిగాం. సైంటిస్టులను ప్రోత్సహించాం. కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్‌లో ఉంది. ప్రధాని మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్‌ను పరీక్షించారు' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 'అఖండ -2 తాండవం సినిమాను ప్రతి హిందువు, భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అన్నారు. 'సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలని బండి సంజయ్ సూచించారు.

# 14 ఏండ్ల తర్వాత హంతకుడికి మరణ శిక్ష

**మహిళా హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు తీర్పు**

**హైదరాబాద్, డిసెంబర్ 29:** సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్‌లో 2011లో చోటుచేసుకున్న దారుణ హత్యకేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ కేసులో నిందితుడు కరణ్ సింగ్ అలియాస్ కమ్మ సింగ్‌కి కోర్టు మరణశిక్ష విధించింది. మూడో అదనపు డిస్టిక్ట్ జడ్జ్ మండా వెంకటేశ్వరరావు ఈ కేసులో తుది తీర్పు ఇచ్చారు. మహిళను కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అక్రమ సంబంధం కారణంగా హత్య జరిగినట్లు విచారణలో తేలింది. అప్పటి సనత్‌నగర్ పోలీస్ కానిస్టేబుల్ కప్పరి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తు సమయంలో పటిష్టమైన ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలైంది. నిందితుడికి మరణ శిక్ష విధించడంతో 14 ఏళ్ల తర్వాత బాధితురాలికి న్యాయం జరిగిందని పోలీసులు తెలిపారు. సీపీ అవినాశ్ మొహంతి ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ తీర్పుతో మహిళలపై జరిగే హింస ఘటనలపై చట్టపరమైన దృఢమైన సందేశమని పోలీసులు వ్యాఖ్యానించారు.





# సైబర్ కేసుతో కోటి 95 లక్షల 75 వేల లూటీ

**మహిళ ఫిర్యాదుతో ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్**

**అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక**

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** సైబర్ మోసాలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా, తరచూ హెచ్చరికలు చేస్తున్నా... ఎక్కడో ఒక చోట అమాయకులు సైబర్ కేటుగాళ్ల బారిన పడుతునే ఉన్నారు. తాజాగా ఓ బాధితురాలకి సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించి భారీగా నగదు దోచుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఓ బాధితురాలని డిజిటల్ అరెస్ట్ పేరుతో కోటి 95 లక్షల 75 వేల రూపాయల మోసం చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆమె ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి కేటుగాళ్ల ఆట కట్టించారు. ఈ కేసులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. డిసెంబర్ 13వ తేదీన డిజిటల్ అరెస్టుకు గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేటుగాళ్ల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే నిందితులు భావ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సోయబ్, బెలీం అనాస్‌లను అరెస్ట్ చేశారు. ప్రభుత్వ అధికారులుగా నటించి మహిళను భయపెట్టారు మోసగాళ్లు. భర్తపై కేసు ఉందని అంటూ బెదిరింపులు, నకిలీ కాల్స్ చేశారు నేరస్తులు. కరెన్సీ వెరిఫికేషన్ పేరుతో డబ్బు బదిలీలు చేశారు. మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత దుబాయ్‌కు హవాలా మార్గంలో నగదు బదిలీ చేశారు. మొత్తం 22 సైబర్ కేసుల్లో నిందితులు ఇద్దరు బ్యాంక్ ఖాతాలు వాడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు సుమారుగా రూ. 3.5 కోట్ల లావాదేవీలు చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నిందితుల దగ్గరి నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపించే మెయిల్స్‌ను క్లిక్ చేయొద్దని కోరారు. అమాయకులను మోసగించే సైబర్ క్రిమినల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రిమినల్స్ అధునాతన సాంకేతికతను ఉపయోగించి అమాయకులను మోసం చేస్తున్నారని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

# కమ్యూనిస్టులను లేకుండా చేసే కుట్ర

**కేంద్రం తీరుపై మండిపడ్డ కూనంనేని**



**హైదరాబాద్, డిసెంబర్ 29:** కమ్యూనిస్టులు లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను సైతం డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడం దుర్మార్గంమైన చర్యని, కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రజల కోసమా అదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా తేల్చాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆపరేషన్ల పేరుతో సాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా తిరుగుబాటు ఉద్యమాలు తప్పవన్నారు. మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన అపార ఖనిజ సంపదను కాజేసేందుకు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను హతమార్చడం సరైంది కాదన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ ఈ మారణ హోమానికి తెగబడటం పైచాచికమని, మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రాణాంతకంగా చైనా మాంజా

**చైనా మాంజా తగిలి యువకుడి గొంతుకు గాయం**

**హైదరాబాద్, డిసెంబర్ 29:** హైదరాబాద్ నగరంలో చైనా మాంజా ఆందోళన కలిగిస్తోంది. చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు. అయితే ఇది చాలా మంది ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక వ్యక్తి చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా మరో వ్యక్తి చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన జమీల్ అనే యువకుడు చార్మినార్ వైపు బైక్ వెళుతున్నాడు. శంషీర్ గంజ్ ప్రాంతంలో చైనా మాంజా అతడి గొంతుకు తగిలి కోసుకు పోయింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

# ముగ్గురు సలహాదారుల నియామకం

మొదటి పేజీ తరువాయి

కేంద్రాలున్నాయి. పోచంపల్లి శ్రీధర్‌రావును ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. కార్టూనిస్ట్ శ్రీధర్‌గా సుపరిచితులైన ఆయన మాస్ కమ్యూనికేషన్స్‌లో సేవలు అందిస్తారు. దేవదాయశాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. మంతెన, శ్రీధర్, సీతారామాంజనేయ ప్రసాద్ తమ పదవుల్లో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. మాస్ కమ్యూనికేషన్ ప్రభుత్వ సలహాదారు నియామకంపై జీవో తొలుత తప్పుగా జారీ అయింది. గంటల వ్యవధిలో తప్పును సరి చేసిన జీఏడీ మరో జీవోను జారీ చేసింది. సరిచేసిన జీవోలో దేవదాయ శాఖ సలహాదారులుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. తొలుత జారీ చేసిన జీవోలో ఆయన్ను మాస్ కమ్యూనికేషన్స్‌కు సలహాదారుగా పేర్కొనడం గమనార్హం.



సంపాదకీయం

# కేసీఆర్ మాటలకు చింతకాయలు రాలేనా?

మాటలకు చింతకాయలు రాలుతాయా అంటే.. రాలుతయానే అంటారు మాజీ సీఎం కేసీఆర్. ఎందుకంటే ఆయన మాటలతోనే పదేళ్లపాటు ఓట్లు రాల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగానికి సిద్ధం అవుతు న్నారు. రెండేళ్లుగా ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగం లోకి దిగబోతున్నట్టు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇంతకాలం విపక్షనేతగా ఆయన విఫలం అయ్యారు. తోలు తీయడానికి ముందు గత 9 ఏళ్ల పాపాల గురించి ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేది. ధరణి,ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు, ఈ-కార్ రేసింగ్ తదిరఅ వినతి కేసులు చాలానే ఉన్నాయి. వీటికి సమాధానం చెప్పడం లేదు. పైగా కేసీఆర్ కొడుకు లొట్టపీసు కేసులని బెదిరింపులకు దిగారు. ఏతావాతా రాజకీయ నేతల భాష జుగప్సాకరంగా మారింది. ఉన్నట్టుండి తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కేవలం రాజకీయంగా మళ్లీ పట్టు సాధించేందుకే తప్ప మరోటి కాదు. మళ్లీ నీళ్లు,నిధులు, నియామకాలు అంటూ నినదిస్తానని ప్రకటించినట్లు సమాచారం. తెలంగాణ ఏర్పడి పన్నెండేళ్ల తరవాత ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకునే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలి. తెలంగాణపై బీఆర్ఎస్‌కు మాత్రమే పెటెంట్ ఉన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. తమ హయాంలో పదేళ్ల మోసాలపై మాత్రం మాట్లాడడం లేదు. ఇదంతా కేవలం రాజకీయ డ్రామా అని మాత్రం ప్రజలకు కూడా తెలుసు. వరుస ఓటములతో బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు, పంచాయితీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. దీంతో ఇక కెటిఆర్‌తో లాభం లేదనుకున్నాడేమో.. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతానని ప్రకటించారు. గతకొంతకాలంగా బీఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు ఇదే ప్రకటిస్తూ వస్తున్నారు. మరోవైపు కూతురు కవిత జనంజాగృతి బాటతో బీఆర్ఎస్ నాటి పాలనా వైఫల్యాలను తూర్పారాబడుతున్నారు. ఆనాడు జరిగిన తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. అభివృద్ది, బంగారు తెలంగాణ పేరుతో జరిగిన ప్రచారమంతా డొల్ల అని ఆమె కళ్లముందే కనిపిస్తుంటే.. వలపోస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుకంటూ వచ్చారు. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికార కోల్పోయాక జరిగిన తర్వాత వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో సిఎం రేవంత్ రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో కేసీఆర్‌పై విరుచుకు పడుతున్నారు. అసెంబ్లీకి రా తేల్చుకుందామని, చర్చిద్దామని సవాళ్లు విసరుతున్నారు. ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే బాగుండ దనో ఏమో కేసీఆర్ ..సై అంటూ సవాళ్లు విసిరారు. అందుకే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కయి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కేసీఆర్‌కు అలవాటుగా మారింది. 2018లో చంద్రబాబును బూచిగా చూపించి బొడ్లో కత్తిపెటుటుకుని తిరుగుతున్నాడని ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రచారం ఫలించి రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో అది పనిచేయలేదు. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పల్లవితో సభలు పెట్టేందుకు సిద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి అయినందున ఆయన తన సొంత జిల్లాకు అన్యాయం చేసుకుంటారని ఎవ్వరు కూడా అనుకోరు. చంద్రబాబు తో కుమ్మక్కు అవుతారనడానికి ఆధారాలు లేవు. ఏ రాజకీయ నాయ కుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేస్తారని అనుకోవడానికి లేదు. అందులోనూ కేసీఆర్‌ను ఇక అధికారంలోకి రానివ్వనని శపథం కూడా చేశారు. పాలమూరు రంగారెడ్డిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అందుకేనేమో కేసీఆ ర్ కూడా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. నీటి అంశాలపై ప్రజలు వెంటన స్పందిస్తారి అనుకుని ఉంటారు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది. ఉంది. తెలంగాణలో పెట్టుబడు లను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేసారు. నిజానికి తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకనే రెండేళ్లుగా ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. అసెంబ్లీకి కూడా రాకుండా పోయారు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కేసీఆర్ సహా బీఆర్ఎస్ శ్రేణులకు ఇప్పటికీ మింగుడు పడడం లేదు. దీనికితోడు సొంతంగా వ్యూహాలతో కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తున్నారు. రాజకీయం గా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారని అనుకుంటే అలా జరగడం లేదు. అందుకే ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారం లోకి వచ్చారని ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉంటాయని ఇంకా కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే కృష్ణాజలాల పేరుతో రాజకీయానికి పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో అతిశయంతో పనిచేస్తే ఓటమి తప్పదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులుగా విస్మరించారు. ఇప్పుడు ప్రజలకోసం అని బయలుదేరితే ప్రజలు నమ్ముతారని అనుకోవడం కేసీఆర్ మూర్ఖత్వమే అవుతుంది.

# ఆరావళి ఉత్తర్వులపై సుప్రీం స్టే

**కొత్త కమిటీతో ఆరావళిపై అధ్యయనానికి ఆదేశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమ వారం విచారణ సందర్భంగా కీలక నిర్ణయం ప్రకటించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకుంది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 100మీటర్లలోపు ఎత్తు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు గతంలో అనుమతులు ఇచ్చింది సుప్రీంకోర్టు. తాజాగా గతంలో ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచంగా ఉన్న ఆరావళి పర్వతాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త నిర్వచనం జాతీయస్థాయిలో దుమారం రేపుతోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు స్పందించింది. గత నెల తాను ఇచ్చిన ఆదేశాలను సోమవారం నిలిపివేసింది. 'కోర్టు ఆదేశాలు, కమిటీ సిఫార్సులు నిలిపి వేయడం అవసరమని మేం భావిస్తున్నాం. కొత్త కమిటీ ఏర్పాటయ్యేవరకు ఈ స్టే అమల్లో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. కొత్త నిపుణుల బృందాన్ని




ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని ఎప్పటినుంచో ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు... అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. దీనివల్ల హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. విచారణ సందర్భంగా తాత్కాలిక దరఖాస్తుదారుల ప్రవర్తనపై సీజెఐ తీవ్ర అసంతృప్తి చెందారు. ఆరావళి పర్వతాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించింది. ఈ కేసును జనవరి 21న వివరణాత్మకంగా విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

# ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీం జోక్యం

**కుల్దీప్ సింగ్ సెంగార్‌కు బెయిల్ రద్దు చేస్తూ ఉత్తర్వులు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీమ్ ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. 2017లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అత్యాచార కేసులో.. బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఇద్దరు న్యాయవాదులు సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. మరోవైపు ఇదే విషయమై.. సీబీఐ కూడా సర్వోన్న న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్లు వేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది.ఈ వ్యాజ్యంపై సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జేకే.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. సోమవారం విచారణ




చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం. అయితే.. తాజాగా ఈ కేసులో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. సెంగార్‌కు పోక్సో చట్టం వర్తించదని.. ఢిల్లీ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

## భారతీయుల వర్క్ పర్మిట్లు రద్దు చేయాలి

**విషం కక్కిన బంగ్లాదేశ్ ఇంకిలాబ్ మోంచా**

**ఢిల్లీ, డిసెంబర్29:** విద్యార్థి నాయకుడు, ఇంకిలాబ్ మోంచా నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. హాదీ హత్య నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వంపై మండిపడుతోన్న ఇంకిలాబ్ మోంచా.. తాజాగా భారతీయులపై విషం కక్కింది. బంగ్లాలో ఉన్న భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు యూనస్ ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం గమనార్హం. హాదీ హత్యకు న్యాయం చేయాలని కోరుతూ ఇంకిలాబ్ మోంచా పలు డిమాండ్లు చేసింది. తమ నాయకుడి మరణానికి కారణమైన నిందితులు, వారికి సహకరించిన వారిని 24 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో నివాసం ఉంటున్న భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దు చేయాలని కోరింది. షేక్ హసీనాను అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే.. ఆ దేశంపై అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు వేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తమ ఫేస్‌బుక్ ఖాతాలో దీనిపై పోస్ట్ చేసింది. ఈ సందర్భంగా సోమవారం భారీఎత్తున ఆందోళనలకు పిలుపునిచ్చింది. భారత వ్యతిరేకి అయిన 32 ఏళ్ల ఉస్మాన్ హాదీపై డిసెంబరు 12న ఢాకాలో కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని సింగపూర్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ 18న మరణించాడు. హాదీ మృతి వార్త తెలియగానే బంగ్లాదేశ్‌లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. మీడియా సంస్థలు, అవామీ లీగ్ కార్యాలయాలపై నిరసనకారులు దాడులు చేశారు. ఈ క్రమంలోనే హాదీని చంపిన ఇద్దరు వ్యక్తులు భారత్‌లోకి ప్రవేశించినట్లు బంగ్లా మీడియాలో కథనాలు వచ్చాయి. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది.

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

**ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు ● క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు**

**తిరుమల, డిసెంబర్ 29:** శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు స్వామివారి దర్శనాన్ని దివ్య అనుభూతిగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. భక్తులందరూ టీటీడీ క్యూలైన్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించు కుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని తెలియజేశారు. టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీలలో నిర్దేశిరచిన సమయానికి మాత్రమే తిరుమలలోని దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్క్‌లు ఏర్పాటుచేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఎస్సీ -5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచిచూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిదని సూచించారు.

# ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- **సజీవదహనం అయిన చంద్రశేఖర్**
- **బ్యాగులో నోట్లకట్టలు, బంగారం లభ్యం**
- **పలు రైళ్ల రాకపోకల్లో ఆలస్యం**




**విశాఖపట్నం, డిసెంబర్ 29:** అనకాపల్లి జిల్లా ఎలమంచిలి వద్ద ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం తెల్లవారు-జూమున మంటలు చెలరేగి, ప్రమాదంలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్(70) అనే వ్యక్తి సజీవ దహనమయ్యారు. మృతుడికి చెందిన బ్యాగులో భారీగా నగదు, బంగారం ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. చంద్రశేఖర్ కుటుంబసభ్యుల సమక్షంలో బ్యాగును తెరిచి చూడగా రూ. 5. 80లక్షల నగదు, బంగారం ఉన్నట్లు నిర్ధరించారు. చాలా వరకు నోట్లకట్టలు కాలిపోయి ఉన్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లతో పాటు విశాఖకు రావాల్సిన మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లాల్సిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్, పూరీ-తిరుపతి, ఈస్ట్‌కోస్ట్, బెంగళూరు హంసఫర్, షాలిమార్-చర్లపల్లి(18045), విశాఖ-లింగంపల్లి (12805), విశాఖ-గుంటూరు (17240) ఎక్స్‌రైళ్లు 3-4 గంటలు ఆలస్యమయ్యాయి. విశాఖకు రావాల్సిన గోదావరి, తిరుపతి-హౌవ్‌డా కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎలమంచిలిలో ఆగే రైళ్లను అధికారులు విశాఖలో నియంత్రించి పంపుతున్నారు. ఎలమంచిలిలో స్టాప్ లేని వాటిని యథావిధిగా పంపిస్తున్నారు. వందేభారత్, జన్మభూమి సూపర్‌ఫాస్ట్ రైళ్లు విశాఖ నుంచి యథావిధిగా బయల్దేరాయి. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సింహాద్రి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ల కోసం పెద్ద ఎత్తున నిరీక్షిస్తున్నారు. ఎలమంచిలిలో జనరల్ టికెట్లను రైల్వే అధికారులు నిలిపివేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. రైలు ప్రమాదం నేపథ్యంలో పలు స్టేషన్లలో హెల్ప్‌లైన్ నంబర్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. రైళ్ల సమాచారానికి సంబంధించిన వివరాలను కాల్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

# జిల్లాల పునర్విభజనకు కేబినేట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది. దీనికి సంబంధించి తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు, రాజంపేటను కడప జిల్లాకు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు, గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలిపే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ క్యాబినెట్ సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి (ఖీజీపూసజీబజీట ఖీ।టటా) కన్నీటి పర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి మార్పుపై ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. మంత్రి రాంప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఓదార్చారు. జిల్లా కేంద్రం మార్చుకుంటే తలెత్తే సాంకేతికపరమైన ఇబ్బందులను మంత్రికి ఆయన వివరించారు. రాయచోటి అభివృద్ధి విషయాన్ని తాను చూసుకుంటానని చంద్రబాబు ఇచ్చారు. రాంప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో సాంకేతిక అంశాలను పక్కన పెట్టి జిల్లాల పునర్విభజనను గత వైసీపీ ప్రభుత్వం చేపట్టడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై స్థానికలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా



రాయచోటినే ఉంచాలంటూ ఆందోళనలు, నిరసనలకు దిగారు. ముఖ్యంగా ఈ అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దాంతో ఈ సమావేశంలో కొద్ది సేపు నిశబ్దం ఆవరించింది. జిల్లా కేంద్రం మార్చుకుంటే ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను మంత్రి రాం ప్రసాద్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాయచోటి అభివృద్ధిని తాను చూసుకుంటానంటూ మంత్రి రాం ప్రసాద్ రెడ్డికి సీఎ చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితోపాటు రాం ప్రసాద్ రెడ్డి కేబినెట్ నుంచి బయటకు వచ్చారు. కానీ మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే రాం ప్రసాద్ రెడ్డి బయటకు వెళ్లిపోయారు.

# అన్ని ఆలయాల్లో 'శ్రీవారి సేవకులు' తరహా విధానం

**అమరావతి :** రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో తిరుమల శ్రీవారి సేవకుల తరహాలో స్వచ్ఛంద సేవలను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారు లను ఆదేశించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించాలని, భూ సర్వేల్లో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. సోమవారం నాడు అమరావతిలోని ఆర్టీజీఎస్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, వైద్యారోగ్యం, దేవదాయ సహా పలు కీలక శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయనే దానిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానిక భక్తులతో వాలంటీర్లను నియమించుకోవాలి. భగవంతుడి సేవ చేసేందుకు చాలామంది ముందుకొస్తారు. అలాంటి వారిని ప్రోత్సహించి, వారి సేవలను వినియోగించుకోవాలి. ఇప్పటికే శ్రీశైలంలో ఈ విధానం కొనసాగుతోంది. ఇదే స్ఫూర్తితో అన్ని ఆలయాల్లో అమలు చేయాలి" అని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రెవెన్యూ, వైద్యారోగ్య శాఖల పనితీరుపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందాలి. భూ సర్వేలు చేపట్టేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకూడదు. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగంపై ఉన్న చెడ్డపేరును తొలగించుకునేలా పనిచేయాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అన్నిచోట్లా పరిశుభ్రత పాటిస్తూ, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వైద్యులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం వ్యవసాయ, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "భూసార పరీక్షలు నిర్వహించి, ఎరువుల వాడకాన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ పంటలు పండించాలో తెలియజేయాలి. దీనికోసం క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిసి పనిచేయాలి" అని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, మిల్లర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రవాణా శాఖను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరు బాగుందని అభినందించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజాభీష్టం మేరకే జిల్లాల్లో మార్పులు, చేర్పులు

**17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడి**

**సాంఘిక సంక్షేమ శాఖలో రుణ గ్రహీతలకు ఉపశమనం**

**ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు**

**రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ**


**కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు**



**అమరావతి :** ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లాల ఏర్పాటులో మార్పులు, చేర్పులు చేసినట్లు మంత్రులు తెలిపారు. క్యాబినెట్‌లో 24 అంశాలను చర్చించి ఆమోదం తెలిపినట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌తో కలిసి అనగాని వెల్లడించారు. సాంఘిక సంక్షేమ శాఖలో రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆమోదించామన్నారు. 9 జిల్లాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదని.. 17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు. ప్రజల కోరిక మేరకు డివిజన్లు, మండలాలు మార్చామన్నారు. గత ప్రభుత్వం సరిగా ఆలోచించకుండా జిల్లాల విభజన చేసిందని విమర్శించారు. గతంలో పారదర్శకంగా చేసుంటే ఈ సమస్యలు వచ్చేవి కావని మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్ వ్యాఖ్యానించారు. గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు ఉన్నాయి. గ్రేటర్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నాం. జవనరి 9లోగా పాస్‌బుక్‌ల పంపిణీ పూర్తి చేస్తాం. తప్పులు సరిచేశాకే పాస్‌బుక్‌లు ఇవ్వాలని ఆదేశించాం. పాస్‌బుక్‌లపై గత పాలకుల ఫొటోలు తొలగించాం. పోలవరం పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాయచోటిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం హామీ ఇచ్చారు. మంత్రి మండిపల్లిని పిలిచి సీఎం చంద్రబాబు ఓదార్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురవడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు మంత్రితో మాట్లాడారు. అలాగే రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లా స్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం జరిగింది. రాయచోటి మార్పు వ్యహారంపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చాలా బాధపడుతున్నారని తెలిపారు. అందుకే ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి మంత్రిమండలి తరవాత కూడా రాంప్రసాద్ రెడ్డిని పిలిచారన్నారు. ఆయన్ను ఓదార్చినట్లు తెలిపారు. రాయచోటిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారని అన్నారు. ఆయనకు మెడికల్ కాలేజీ కావాలా?.. ఇంకేం ఏమన్నా కావాలా అన్న విషయాన్ని ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. అలాగే రాంప్రసాద్ రెడ్డి రాజీనామా లాంటి హెస్టీ డెసిషన్‌లాంటివి తీసుకోరన్నారు. ఆయనకు కూడా తమ ప్రాంత అభివృద్ధి ముఖ్యం అని భావిస్తారని మంత్రి స్పష్టం చేశారు. అన్నమయ్య ఎక్కడ జన్మించినా శ్రీవారి సేవలో ఉన్నారని తెలిపారు. అన్నమయ్యకు ప్రాంతాలు ఉండవని... గతంలో కూడా కృష్ణా జిల్లాలో ఎన్టీఆర్ జన్మిస్తే ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు చేసి పెట్టారని మంత్రి అనగాని గుర్తుచేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి కేంద్రం సహకారంతో ప్రభుత్వంలో చేస్తున్న అనేక కార్యక్రమాలను కేబినెట్ చివరన సీఎం తెలిపారన్నారు. అభివృద్ధి, సంక్షమం కింద రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచామని....

రూ.50 వేల కోట్లు పెన్షన్ల కింద పంపిణీ చేశామని అన్నారు. సూపర్ సిక్స్ చాలా బాగా సక్సెస్ చేయగలిగామని.... ఆర్థిక ఇబ్బందులున్నా దీన్ని అధిగమించగలిగామని తెలిపారు. ప్రతి గ్రామంలో పల్లె పండుగ తెచ్చి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి గూగుల్ విశాఖకు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. గంజాయిపై తాము చేసిన యుద్ధం గురించి కూడా సీఎం కేబినెట్‌లో ప్రస్తావించారని తెలిపారు. రాయలసీమలో తిరుపతిని ఇండస్ట్రియల్ హబ్‌గా, నెల్లూరు పోర్టును ఉపయోగించుకొని 2026లో ముందుకు వెళితే స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ముందుకు వెళాతామన్నారు. పట్టుదలతో , అంకిత భావంతో బాధ్యతగా పనిచేద్దామని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వపరంగా చాలా కార్యక్రమాలను అమలు చేశాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి దిగ్విజయంగా చేసిన పనులు గురించి చర్చించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 50 వేల కోట్ల వరకూ ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు అందించాం. సచివాలయాల విషయంలోనూ చాలా మార్పులు చేశాం. ఇప్పటి వరకు రూ. 1200 కోట్లు వెచ్చించి రోడ్లను వేశాం. రూ. 2,500 కోట్లు మంజూరు చేసి రోడ్లను మరమ్మతు చేయిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతి గ్రామంలో ప్లలె పండుగ కార్యక్రమం తీసుకొచ్చారు. విశాఖలో పెద్ద ఎత్తున పెట్టుబడులను సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకొచ్చాం. ఐటీ సేవలను మరింత విస్తృతం చేసి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాం. పోలీసు శాఖను బలోపేతం చేశాం. గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారుస్తున్నాం' అని మనోహర్ తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ముందుకెళుతున్నాం. గతంలో జరిగిన విధ్వంసకర చర్యలను సరి చేస్తున్నాం. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతుల కోసం దాదాపు రూ. 3 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నాం. కొప్పర్తి, ఓర్వకల్లుకు పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డు వెళ్తుంది. కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా పథకాలకు తమ పేర్లను కాకుండా.. మహనీయుల పేర్లను పెడుతున్నాం. దీనిపైనా మంత్రివర్గం లో చర్చ జరిగిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రధానంగా విశాఖలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు, పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చేందుకు ఆమోదం లభించింది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం కలిపి జిల్లా ఏర్పాటు చేయనున్నారు. బనగానపల్లె, అద్దరోడ్డును డివిజన్లగా ఏర్పాటు చేస్తారు. చేర్పులు, మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉంటుంది.. జిల్లా కేంద్రం మాత్రం మదనపల్లెకు మారుతుంది. అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్పు చేశారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి సబ్‌డివిజన్‌లోనే దర్శి నియోజకవర్గం ఉంటుంది. రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలోకి, కడపలోకి సిద్ధవటం, ఒంటిమిట్ట మార్పు చేయగా, ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా మడకశిరను ఏర్పాటు చేయనున్నారు.

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



మొదటి పేజీ తరువాయి

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులతో అన్నారు. భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతికత ద్వార భక్తులు, వాహనాల రద్దీపై ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. టీటీడీ, పోలీస్, విజిలెన్స్ విభాగాల నుండి ఐటీ నిపుణులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు భక్తుల సమాచారాన్ని అప్డేట్ చేస్తూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల సెంటర్ లో ప్రదర్శించాలని చెప్పారు. భవిష్యత్తులో తిరుమలకు వచ్చే భక్తుల కోసం సమస్య రహిత వ్యవస్థను నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి. హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునేవిధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చలికాలం కావడంతో క్యూలైన్లలోని అన్న ప్రసాదాల పంపిణీ కేంద్రాల్లో అన్న ప్రసాదాలు చల్లబడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులకు తాగునీరు అందించేందుకు అదనంగా మొబైల్ వాటర్ డ్రమ్స్, మూడు మొబైల్ ఫుడ్ వ్యాన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తుల కోసం టీటీడీ అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించు కునేందుకు వివిధ భాషల్లో సూచిక బోర్డులను కూడా క్యూలైన్లలో మరియు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టీటీడీ క్యూలైన్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామివారిని దర్శంచుకోవాలని తెలియజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలను పురస్కరించుకుని విచ్చేసే భక్తుల రద్దీ దృష్ట్యా డిసెంబర్ 28 నుండి జనవరి 7వ తేది వరకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ లో భక్తులకు ఇచ్చే ఞూఆ టోకెన్ల జారీని రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించవలసిందిగా భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేయడమైనది. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు. తొలి మూడు రోజులు అనగా, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 01వ తేదీల్లో ఈ-డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం. టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీలలో నిర్దేశిరచిన సమయానికి మాత్రమే తిరుమలలోని దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు తిరుమలలో భక్తులకు ఏ ఇబ్బందులూ రాకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి వెల్లడించారు. తొలిరోజు ప్రొటోకాల్ దర్శనాలు ముగిసిన వెంటనే స్లాటెడ్ సర్వదర్శనం మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత 1:30 నుంచి మంగళవారం రాత్రి 11:45 గంటల మధ్య.. 20 గంటల పాటు సామాన్యులకే అవకాశం కల్పిస్తాం. సుమారు 70వేల మందికి దర్శనం చేయించాలన్నది లక్ష్యం. ఏ రోజు టోకెన్ పొందితే, అదేరోజు దర్శనం చేయించేలా గంటలవారీగా లెక్కలు కట్టి అమలుచేస్తాం. ఇందుకోసం ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగించనున్నాం. భక్తులు టోకెన్‌పై నిర్దేశిరచిన సమయానికి, సూచించిన ప్రదేశానికి రావాలి. వేచి ఉండే భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం తదితర 16 రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. మొదటి మూడు రోజులు 24 గంటలూ అన్నప్రసాదాలు, వేడి పానీయాలు కాఫీ, టీ, బాదం పాలు, చిన్నపిల్లలకు పాలు సిద్ధంగా ఉంటాయి. నిత్యం 4.30 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నాం. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్క్‌లు ఏర్పాటుచేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఏసీ -5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచిచూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిదని సూచించారు.

## తిరుమలలో భారీగా ఏర్పాట్లు

**తిరుమల :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి తితిదే విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేకువజామునే వివిఐపిల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తితిదే సీవీఎస్వో, జిల్లా ఎస్పీ, చీఫ్ ఇంజినీర్, పలు విభాగాల అధికారులు బీఆర్ నాయుడు వెంట ఉన్నారు. శిలాతోరణం, కృష్ణతేజ, ఏటీజీహెచ్ క్యూలైన్ ఎంట్రీ పాయింట్స్ వద్ద క్షేత్రస్థాయిలో సదుపాయాలను వారు పరిశీలించారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో 1.89 లక్షల టోకెన్లను ఈ-డిప్ ద్వారా తితిదే కేటాయించింది. టోకెన్లు ఉన్న భక్తులకే ఆ మూడు రోజుల్లో దర్శనం కల్పించనున్నారు. ఎంట్రీ పాయింట్స్ వద్ద టోకెన్ స్కానింగ్ పక్రియను ఛైర్మన్‌కు అధికారులు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా క్యూలైన్ నిర్వహించాలని బీఆర్ నాయుడు అధికారులకు సూచించారు.

# మందుబాబులకు శుభవార్త

## రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు

**అమరావతి :** నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం విక్రయాలు, సేవల సమయాలను పొడిగించేందుకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి మంజూరు చేశారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక అనుమతుల ప్రకారం.. డిసెంబర్ 31 మరియు జనవరి 1 రాత్రుల్లో మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు విక్రయించవచ్చు. అలాగే బార్లు, (ఇన్-హౌస్) లైసెన్సులు కలిగిన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థలకు రాత్రి 1 గంట వరకు మద్యం విక్రయాలు, సర్వీస్‌కు అనుమతి ఇచ్చారు. గత ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా అమలు చేసిన విధానాన్నే ఈ ఏడాదీ కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల అమలుకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది.

## తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ"అరుణాచలగిరి ప్రదర్శన"చేయాలనుకునే భక్తులకు శుభవార్త"


**పరిగి బస్ డిపో మేనేజర్,కె. కృష్ణమూర్తి**



**పరిగి,మున్సిపల్, డిసెంబర్,29(సమయం న్యూస్)** :మన పరిగి డిపో నుండి జనవరి 03.01.2026 పౌరమి పర్వదినాన ప్రసిద్ధ,పవిత్ర అరుణాచలం పుణ్యక్షేత్రంలో "గిరి ప్రదర్శన"చేయాలనుకునే మన పరిగి మరియు వికారాబాద్ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిగి డిపో వారు ఒక ప్రత్యేక, అధునాతన సూపర్ లగ్జరీ బస్సు నడపాలని నిరయించారు.ఈ జనవరి 01.01.2026 సాయంత్రం 8 గంటలకు పరిగి నుండి బయలుదేరి తేదీ 02.01.2026 న ఆంధ్ర ప్రదేశ్ లోని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనం,వేలూరు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి(గోల్డెన్ టెంపుల్)దర్శనం అనంతరం 03.01.2026 న అరుణాచలం గిరి ప్రదక్షణ,దర్శనం పూర్తయిన తర్వాత 03.01.2026 రోజున తిరుగు ప్రయాణంలో శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం దర్శనం చేసుకొని 04.01.2026 సాయంత్రం 3.00 గంటలకు పరిగి చేరుకుంటుంది.టిక్కెట్ ధర ఒక్కొక్కరికి లి 3800/- అడ్వాన్స్ బుకింగ్, మరిన్ని వివరాలకు 7569065644 నంబర్లకు సంప్రదించగలరు.కావున భక్తులందరూ పవిత్రమైన ఈ పౌరమి రోజున అరుణాచలేశ్వరుడిని దర్శించి సకల సుఖాలు పొందవలసిందిగా మనసూర్తిగా కోరుకుంటున్నాను.కె. కృషమూర్తి డిపో మేనేజరు- పరిగి వికారాబాద్ జిల్లా

## చైనీస్ మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు


**- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS**



**వికారాబాద్, డిసెంబర్,29(సమయం న్యూస్) :** గాలిపటాలు ఎగురావేయడానికి చైనిస్ మాంజా ను ఉపయోగించవద్దు అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయించడం, నిల్వ చేయడం మరియు వాడటంపై ప్రభుత్వం నిషేధం విధించిందని, పర్యావరణానికి, పక్షులకు మరియు ముఖ్యంగా ద్విచక్ర వాహన దారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ దారం గాలిపటాలు ఎగురవేసే సమయంలో మెడకు లేదా శరీర భాగాలకు తగిలితే తీవ్రమైన గాయాలు కావడమే కాకుండా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని, గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయని ఎస్పీ గుర్తు చేశారు.జిల్లాలోని ఫ్యాన్సీ షాపులు, గాలిపటాల విక్రయ కేంద్రాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, ఎక్కడైనా నిషేధిత చైనీస్ మాంజా కనిపిస్తే వెంటనే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత విక్రేతలపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కేవలం వ్యాపార లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఆమె వ్యాపారులకు సూచించారు. పర్యావరణ హితమైన, సురక్షితమైన నూలు (కాటన్) దారాలను మాత్రమే విక్రయించాలని మరియు కొనుగోలు చేయాలని ఎస్పీ కోరారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల ఇట్టి విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ జిల్లా ప్రజలను కోరారు.

## మహిళా రక్షణ మన కర్తవ్యం.

**● శ్రీను అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)**



**నారాయణపేట, డిసెంబర్,29(సమయం న్యూస్) :** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ- జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ చట్టం గురించి జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం, 2013 గురించి వివరించారు. మహిళల రక్షణ,మహిళాభివృద్ధి , మహిళా సాధికారత కోసం అందరం కృషి చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ రషీద్, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోర్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, లీగల్ కౌన్సిలర్ రామాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇంచార్జ్ అదనపు కలెక్టర్గా రాజేశ్వరి (రెవెన్యూ)



**వికారాబాద్ జిల్లా,డిసెంబర్,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా లో ఇంచార్జి అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) గా రాజేశ్వరి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ (ఐఏఎస్)ను కలిసి పూల మొక్క అందజేసి ధన్యవాదములు తెలిపారు

## ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి.

- అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.
- ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు
- మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.



**నారాయణపేట, డిసెంబర్,29(సమయం న్యూస్) :** ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు.ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు.ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు.ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్,నకిలీ వెబ్సైట్లు,స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు.సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

## ఖమ్మం నగర రౌడీషీటర్లకు పోలీస్ కౌన్సెలింగ్



**ఖమ్మం , డిసెంబర్ 29 : ( సమయం న్యూస్ ) :** పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సోమవారం ఖమ్మం నగరలోని రౌడీషీటర్లకు టౌన్ ఏసీపీ రమణమూర్తి కౌన్సెలింగ్ ఇచ్చారు.ఏసీపీ కార్యాలయంలో ఒక్కొక్కరి నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వారు ఎక్కడెక్కడ నివాసం ఉంటున్నారు.. ఏం పని చేసి జీవిస్తున్నారో ఆరా తీశారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని పెర్కొన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్తులు, రౌడీషీటర్లు, నేర స్వభావం గలవారు తమ నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, కాదని ఎవరైనా యధావిధిగా నేరాలకు పాల్పడుతున్నట్లు తేలితే ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు.ప్రభుత్వ, ప్రైవేట్ భూముల కబ్జాలకు పాల్పడే రౌడీషీటర్లు, రియల్టర్లపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలిపారు. నగరంలో జరిగే నేరాల్లో ఎక్కువగా రౌడీ షీటర్లే నిందితులుగా ఉంటున్నారని, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని దాడులకు దిగుతూ.. పోలీస్ రికార్డుల్లోకి ఎక్కుతున్న నేపథ్యంలో వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయడంలో భాగంగా ముందుగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు.గత కొంత కాలంగా తమ వైఖరిని మార్చుకుని ఏలాంటి నేరాలు పాల్పడకుండా, పోలీస్ స్టేషన్లలోకేసులు నమోదు కాకుండా సత్ప్రవర్తనతో వున్న పాత నేరాస్థులను ఒక్కొక్కరి కేసు డైరీని పరిశీలించి వారిపై వున్న రౌడీషీట్ ను తొలగించారు. నేరాలు పునరావృతం పరిణామాలు ఉంటాయని, తిరిగి రౌడీ షిట్ తెరుస్తామన్నారు. ఎక్కడైనా రౌడీషీటర్లు, నేరస్తులు ఇబ్బంది పెడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## వికారాబాద్ జిల్లా TUWJ (H-143) జర్నలిస్ట్ యూనియన్ కు నూతన అడహాక్ కమిటీ నియామకం

- జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ లను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ
- వికారాబాద్ జిల్లా కన్వీనర్ గా అసిఫ్ హుస్సేన్.



**వికారాబాద్,డిసెంబర్,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (TUWJ--H143) ప్రస్తుతం ఉన్న కార్యవర్గాన్ని రద్దు చేస్తూ, నూతనంగా అడహక్ కమిటీని నియమించారు. వికారాబాద్ జిల్లా కన్వీనర్గా ఆసిఫ్ హుస్సేన్కో--కన్వీనర్లుగా జీ. నర్సిములు, ప్రహ్లాద్ చారి, టి.ఆనంద్, శ్రీనివాస్లను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ లు నియామక పత్రాలు జరిచేశారు..వికారాబాద్ నియోజకవర్గ కన్వీనర్గా జావేద్,కో--కన్వీనర్గా రాజులను నియమించారు. వికారాబాద్ జిల్లాలో పూర్తిస్థాయి కమిటీని నియమించే వరకు టీయూడబ్ల్యూజె యూనియన్కు సంబంధించిన అన్ని బాధ్యతలు ఈ జిల్లా అడహక్ కమిటీ నిర్వహిస్తుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ,జనరల్ సెక్రటరీ మారుతి సాగర్ లు తెలిపారు..యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగిన టీయూడబ్ల్యూజేరాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వికారాబాద్ జిల్లా నూతన ఆడహాక్ కమిటీ ని నియమించారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గంతో పాటు, 33 జిల్లాల నుంచి యూనియన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే నూతన కన్వీనర్ అసిఫ్ హుస్సేన్, కో కన్వీనర్ లు జీ. నర్సిములు, ప్రహ్లాద్ చారి, టి.ఆనంద్, శ్రీనివాస్ లు మాట్లాడుతు వికారాబాద్ జిల్లాకు టీయూడబ్ల్యూజే నూతన ఆడహాక్ కమిటీ ని నియమించి నందుకు రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ,జనరల్ సెక్రటరీ మారుతి సాగర్ లకు, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారువికారాబాద్ జిల్లా లో టీయూడబ్ల్యూజే యూనియన్ ను పూర్తి స్థాయిలో బలోపేతం చేయడం జరుగుతుందని వారు అన్నారు... జిల్లా లో జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని వారు స్పష్టం చేసారు.వికారాబాద్ జిల్లా లో ప్రతి జర్నలిస్ట్ కు అక్రిడేషన్ లు, ఇల్లాస్థలాలు వచ్చేంత వరకు నిరంతరం పోరాటం చేస్తామని వారు వివరించారు.జిల్లా లో ఉన్న ప్రతి జర్నలిస్ట్ కు టీయూడబ్ల్యూజే(h-143) సంఘం తోడుగా ఉంటుందని వారు స్పష్టం చేశారు..వికారాబాద్ జిల్లాలో టీయూడ బ్ల్యూజే(h-143) సంఘం బలంగా ఉందని వారు వివరించారు..జిల్లా లో అన్ని నియోజీగా వర్గాల్లో యూని యన్ నూతన కమిటీలను కూడా త్వరలో నియమించడం జరుగుతుందని వారు తెలిపారు...నిరంతరం జర్నలిస్ట్ లకోసం పనిచేస్తున్న టీయూడబ్ల్యూజే(h-143) సంఘంకు జిల్లా లో ఉన్న ప్రతి జర్నలిస్ట్ సహకారం అందించాలని వారు కోరారు...

## ఆరేపల్లిలో మెడిసిటి హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం



**రాయపోల్,డిసెంబర్ 29:**రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో మెడిసిటి హాస్పిటల్ ఘనపురం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కర్రోల్ల దివ్య కృష సోమవారం ప్రారంభించారు.ఈ వైద్య శిబిరంలో మొత్తం 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ

గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో జనరల్ మెడిసిన్తో పాటు బీపీ, షుగర్ వంటి సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమ లో ఉపసర్పంచ్ విరేష్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షు లు,ఎఎంసి డైరెక్టర్ బాకీ మల్లేశం,సెక్రెటరీ మౌనిక, వార్డు సభ్యులు కొమురయ్య, రాజు,నవీన్ మాజీ సర్పంచ్ మల్లాగౌడ్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నెంబర్లు కేటాయించాలి కరెంట్ మీటర్లు బిగించాలి

- పువ్వాడ ఉదయ్ నగర్ వాసుల గోడు
- వీర నారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీజకు వినతి



**ఖమ్మం, డిసెంబర్ 29 : ( సమయం న్యూస్ )** తమకు ఇంటి నెంబర్లను కేటాయించాలని అదేవిధంగా కరెంట్ మీటర్లు బిగించాలని రఘునాథపలెం మండలంలోని పువ్వాడ ఉదయ్ నగర్ వాసులు తమ గోడు వినిపించారు. వీరనరీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం సమర్పించారు. పువ్వాడ ఉదయ నగర్ వాసులు వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి కు తమ గోడు వినిపించ గా, ఆమె జాయింట్‌కలెక్టర్ శ్రీజకు వినతి పత్రాన్ని సమర్పించి , అనంతరం ఉపేంద్ర బాయి మాట్లాడారు. ఓర్సు రంగమ్మ కాసా బోయిన అలివేలు మంగమ్మ బత్తుల నాగేంద్ర భూక్య శ్రీకాంత్ భూక్య నాగేంద్ర తేనె యమునా అమరారపు సరోజిని కందునూరి రేణుక మునిగాల వనజ లకు ప్లాట్ల కినెంబర్లు ఉన్నాయని , వీరంతా ఇల్లు కట్టుకుని గత పది సంవత్సరాలుగా నివసిస్తున్నారని తెలిపారు. వీరికి ఇంటి నెంబర్లు రాకపోవడం కొందరికి కరెంట్ మీటర్లు బిగించకపోవడం ఫలితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమపథకాలు దక్కటం లేదన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి ఎన్నోసార్లు వెళ్లిన , విన్నతులు చేసిన పంచాయతీ కార్యదర్శి డబ్బులు డిమాండ్ చేస్తూ వీరికి ఇంటి నెంబర్లు కేటాయించడం లేదని ఆరోపించారు. డబ్బులు ఇచ్చినవారికి కేవలం ప్లాట్లు ఉండి ఎలాంటి ఇంటి నిర్మాణం లేకపోయినా వారికి మాత్రం ఇంటి నెంబర్ కేటాయిస్తు న్నారని విమర్శించారు. ప్రస్తుత సర్పంచ్ సిద్దిక్ తాలూకు బంధువు సలీమా, మరో మహిళ జలగం రాజేశ్వరి లతోపాటు ఖమ్మంలో నివసించే వందనపు రత్నకుమారికి కూడా కేవలం ప్లాట్ కు ఇంటి నెంబరు కేటాయించారని తెలిపారు. తమకు ఓట్లు వేయలేదని కక్షతో సర్పంచ్ సిద్దిక్ ఇలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.అర్హులైన వారికి ఇంటి నెంబర్లు కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సదురు వందనపు రత్నకు మారి కు , పైన పేర్కొన్న లబ్ధిదారులతోపాటు కాకపోతే ప్రభుత్వ సర్వే నెంబర్ 192 లో 75 చదరపు గజముల ప్లాటు ఉందని , ఇంటి నిర్మాణం లేదని అయినప్పటికీ అసెస్మెంట్ నెంబర్ 601 , ఇంటి నెంబరు 4బి 155 కేటాయించారని పేర్కొన్నారు . ఇదంతా సర్పంచ్ , గ్రామ కార్యదర్శి మహేష్ లుకలిసి చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది లబ్ధిదారులకు జీవో 58 ప్రకారం క్రమబద్ధీ కరించాల్సి ఉందని , వీరంతా దరఖాస్తులు సమర్పించు కున్నారని చెప్పారు. కాగా సదరు రత్నకుమారి తన లాయర్ ద్వారా 192 సర్వేలో ఇల్లు నిర్మించుకొని, గత పది సంవత్సరాల నుండి నివసిస్తున్న వారికి ఇది తన భూమిగా ప్రకటిస్తూనోటీసులు పంపించిందని అన్నారు . గతంలోని ఇది ప్రభుత్వ భూమిగా స్పష్టం చేసిన అధికారులు ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ , గ్రామ కార్యదర్శి , వందనపు రత్నకుమారి ల పై చట్టపరమైన , శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో లబ్ధిదారులు యమునా ,వనజ, నీలా ,నాగేంద్ర ,రంగమ్మ, అలివేలు, సుభద్ర ,సరోజిని పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి.

- ప్రజల సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలి.
- ధరూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్.



**వికారాబాద్, డిసెంబర్,29(సమయం న్యూస్) :** జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వికా రాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సోమవారం వికారాబాద్ జిల్లా ధరూర్ సర్కిల్ పరిధిలోని ధరూర్, బంట్వారం మరియు కోట్ పల్లి పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందరరేగా ఆమె పోలీస్ స్టేషన్లలోని రికార్డులను, క్రైమ్ రిజిస్టర్లను మరియు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను క్షుణంగా పరిశీలి ంచారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలను పర్యవేక్షించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో మాట్లాడుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా స్టేషన్‌లో ఎలాంటి ఫైళ్లను పెండింగ్‌లో ఉ ంచకూడదని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరేలా చూడాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూ ర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ పిలుపుని చ్చారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని మరియు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధరూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.రఘు రాములు, బట్వారం ఎస్సై పి. విమల,కోట్ పల్లి ఎస్సై ఎం. శైలజ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్ ప్రతిక్ జైన్ (ఐఏఎస్)



**నారాయణపేట, డిసెంబర్,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లాలో యూరియా కొరత లేదని ఇన్చార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగు తుందని తెలిపారు.ప్రభుత్వ ఆధ్వ ర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలలో మరియు ప్రైవేట్ డీలర్స్ దగ్గర అవసరమైనంత స్టాకు అందు బాటులో ఉందని పేర్కొన్నారు.ఇప్పటివరకు జిల్లా కు యూరి యా అవసరం 2394 మీ కాగా ఇప్పటికే 3000మీ రైతులకు సరఫరా చేసినట్లు, ఇంకా వివిధ పంపిణీ కేంద్రాలలో 1009మీ మరియు లో 2885మీ యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేటు డీలర్ యూరియా పంపిణీ కేంద్రం ముందు తప్పనిసరిగా షామియానా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకే కౌంటర్ వద్ద రద్దీ ఏర్పడకుండా ప్రతి కేంద్రంలో అవసరానికి అనుగుణంగా బహుళ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడ అంతరాయం లేకుండా స్టాక్ అందుబాటులో ఉ ంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటల నుంచి యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు.యూరియా పంపిణీలో ఇలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతానని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు.

# గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కో ఆర్డినేటర్ నాగ మనిమాల

**నారాయణపేట, డిసెంబర్,29(సమయం న్యూస్) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో 2026 – 27 విద్యా సంవత్సరానికి ఆయా గురుకులాల్లో ప్రవేశా లకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ నాగ మణిమాల తెలిపారు.ప్రవేశ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో అయిదవ తరగతితో పాటు ఆరు నుంచి తొమ్మిదవ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఉమ్మడి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు 2026 జనవరి 21 లోగా ఆన్లైన్లో సంబంధిత వెబ్సైట్లో విద్యార్థుల ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బోనఫైడ్, ఫోటో, విద్యార్థి సంతకంతో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలు పొందేందుకు ఫిబ్రవరి 22న ఉమ్మడి ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్, స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం అందించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**అదిలాబాద్ డిసెంబర్29( సమయం న్యూస్).:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, స్వయం సహాయక సంఘాలకు నూతన తరహా రుణాలు అందించడంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బ్యాంకర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించబడింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం సెప్టెంబర్ 2025 మాసంతం వరకు ప్రాధాన్యత రంగాల అడ్వాన్సుల కింద రూ. 4508.78 కోట్లు, వ్యవసాయ రంగం అడ్వాన్సుల కింద రూ. 3347.65 కోట్లు ఉ న్నయని అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై ప్రజలకు, రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు, వీధి వ్యాపారులకు బ్యాంకులు అధికంగా ఆర్థిక సహాయం అందించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. పీఎంఈజీపి , పీఎం ఎఫ్ఎంబి పీఎం విశ్వకర్మ వంటి పథకాల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో కొత్త తరహా లోన్లు ఇవ్వాలని, అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలకు వినూత్నమైన నూతన ఆవిష్కరణ ప్రాజెక్టుల కోసం రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్.బి.ఐ ఏ.జి.ఎం గోమతి, ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, నాబార్డ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో నాణ్యతే లక్ష్యంగా సేవలు

- సత్యనారాయణ రెడ్డికి ఘన వీడ్కోలు
- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి.



**రాయపోల్,డిసెంబర్ 29:**విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపుదిశగా మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సత్యనారాయణ రెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తూ, ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో సత్యనారాయణ రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వ విద్యా పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల విశ్వాసం పొందారని పేర్కొ న్నారు.సుదీరకాలంగా విద్యాశాఖలో అంకితభావంతో సేవలందించిన సత్యనారా యణ రెడ్డి పదవి విరమణ సందరరేగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ విద్యారంగ అభివృద్ధికి తన అనుభవం దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రాజగోపాల్ రెడ్డి నిర్మల, వివిధ మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# టీవీ--మొబైల్ కాదు లక్ష్యం విద్యే భవిష్యత్తు

- ఇండస్ట్రియలిస్ట్ మామిడి బాల్ రెడ్డి.



**రాయపోల్,డిసెంబర్ 29 :** రాయపోల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు డైరీల పంపిణీ కార్యక్రమం సోమవారం ఆత్మీయంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మండల కేంద్రం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఈ సమావేశం లో 1977--98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ మామిడి బాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు డైరీలను అందజేశారు.ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ, విద్యే జీవితాన్ని మలిచే ప్రధాన ఆయుధమని, కష్టపడి చదివితే గ్రామీణ పాఠశాలల నుంచే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తన జీవిత అనుభవాలను ఉదాహరణగా వివరించారు. లక్ష్యసాధనకు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అత్యంత అవసరమని తెలిపారు. విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లకు అతిగా అలవాటు పడటం వల్ల విలువైన సమయం వృథా అవుతోందని,ఇది చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతోందని హెచ్చరించారు. డబ్బు కంటే సమయం చాలా విలువైనదన్నారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో మొబైల్ ఫోన్లు,సోషల్ మీడియా, వినోద కార్యక్రమాలకు దూరంగా ఉండి పాఠ్యపుస్తకాలపై పూర్తి దృష్టి పెట్టాలని హితవు పలికారు.రోజువారీ చదువు లక్ష్యాలను డైరీలో నమోదు చేసుకుంటూ ముందుకు సాగితే విజయం ఖాయమని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.

పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చి సహకరించడం అభినం దనీయమని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయ బృందం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రిటైర్డు పీఈటి నరేందర్, రామ్మోహన్, చిందం రాజ య్య, మచ్చ నర్సింహారెడ్డి,అంజయ్య,దిశ మెంబర్ రవీందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# టీవీఎస్ ఎక్సెల్ ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 29 :** మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డిజగదేపూర్ మండలంలోని పీర్లపల్లి సమీపంలో నిన్న సాయంత్రం టీవీఎస్ ఎక్సెల్ ను కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారూపీర్లపల్లి గ్రామానికి చెందిన దేవి యాదగిరి 59 సంవత్సరాలు,మన్నే ముత్తమ్మ 58 సంవత్సరాలు ఇద్దరు టీవీఎస్ ఎక్సెల్ పై జగదేపూర్ నుండి పీర్లపల్లి గ్రామానికి వస్తున్న క్రమంలో అజాగ్రత్తగా అతివేగంతో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ మనో ధైర్యాన్ని కల్పించారు

అజాగ్రత్త వలన అతివేగం వలన కారు ఢీకొనడంతో రెండు ప్రాణాలు పోయాయని డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించకుండా, డ్రైవింగ్ చేయాలని, ఓవర్ స్పీడ్ తో కాకుండా నిదానంగా జాగ్రత్తగా వాహనాలను నడపాలని వాహనదారులను కోరారు. పోలీస్ అధికారులు కూడా అజాగ్రత్తగా అతివేకంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించాలని పోలీస్ అధికారులను %ఋూ% అధికారులను కోరారు

# రాయపోల్ మండలంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిపై రాజకీయ పోరు

**రాయపోల్,డిసెంబర్ 29:**రాయపోల్ మండలంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడి ఎన్నికల అంశం రాజకీయ వేడిని రాజేసింది. మండలంలో మొత్తం 19 మంది సర్పంచులు ఉండగా,వారిలో బిఆర్ఎస్,బిజెపి పార్టీకి చెందినవారు 11 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందినవారు 8 మంది ఉన్నారు.ఈ నేపథ్యంలో బిఆర్ఎస్--బీజేపీ పార్టీల సర్పంచులు కలసి సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.అయితే దీనికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు అందరూ ఏకమై తమవైపునే ఫోరం అధ్యక్షుడిని ఎన్నుకున్నామని ప్రకటించారు.దీంతో సర్పంచ్ల ఫోరం అధ్యక్ష పదవిపై రెండు వర్గాల మధ్య తీవ్ర పోరు నెలకొంది."మేమే అధ్యక్షులం" అంటూ ఇరు పార్టీల నాయకులు వేర్వేరు ప్రకటనలు చేయడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.ఈ పరిణామాలతో మండల రాజకీయాలు మరింత వేడెక్కాయి. అధికారికంగా ఎవరు సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడో స్పష్టత రావాల్సి ఉందని గ్రామీణ రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడి అంశం రానున్న రోజుల్లో మరింత రాజకీయ చర్చకు దారితీసే అవకాశముందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# మూడోసారి అంతారం సర్పంచ్ గా గవినోళ్ళ శ్రీకాంత్ రెడ్డి

- సన్మానించిన కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి



**దౌల్తాబాద్,మండలం,డిసెంబర్,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా దౌలతాబాద్ మండలం అంతారం గ్రామం సర్పంచ్ గా వరుసగా మూడవసారి ఎన్నికైన గవినోల్ల శ్రీకాంత్ రెడ్డిని కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి చే సన్మానించడం జరిగింది. గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధుల మంజూరు మరియు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని కోరడం జరిగింది.సన్మాన కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

# ప్రతి గ్రామపంచాయతీలో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలి

- పంజాల అశోక్ గౌడ్

- ఎంపిడిఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 29 :** గజ్వేల్ బిజెపి మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ అధ్యక్షతన గజ్వేల్ లోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాజశేఖరరెడ్డి కి ప్రతి గ్రామ పంచాయతీ లో నరేంద్ర మోడీ ఫోటోను పెట్టాలని వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ గ్రామల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం ద్వారానే జరుగుతుంది కావున నరేంద్ర మోడీ ఫోటోను పెట్టాలని డిమాండ్ చేయడం జరిగింది ముఖ్యమంత్రి ఫోటో ఏ విధంగా పెడతారో అదేవిధంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోను పెట్టాలని తెలపడం జరిగింది అని అన్నారు ,మరో వారం రోజుల్లో నరేంద్ర మోడీ ఫోటో పెట్టకపోతే మా మండల శాఖ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ ఫోటోను మేమే స్వయంగా ప్రతి గ్రామ పంచాయతీ లో పెడతామని తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వంజరి రాజు, వెంకటేష్ గౌడ్ మండల ప్రధానకార్యదర్శి లు ఇప్ప స్వామి,బారు అరవింద్ మండల నాయకులు కర్నాల శ్రీనివాసు ,కూమర్ గౌడ్,గణపతి, స్వామి ,బాచిని శివప్రసాద్,స్వామి, భాస్కర్ రెడ్డి,చంద్రం, నరేష్ గౌడ్, కరుణాకర్,యాదగిరి, నవీన్, మహేష్,రవిదంర్, మల్లేశం ,మహెందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు

# ఇద్దరు అనాథ పిల్లలకు బ్యాగులు బుక్కులు అందించిన.అమ్మ నాన్న ఫౌండేషన్ కొడంగల్



**కొడంగల్ మండలం, డిసెంబర్,29(సమయం న్యూస్) :** కొడంగల్ అమ్మ నాన్న ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అనాథలకు చేయూత అందించడం జరిగింది.కొడంగల్ మండలం లోని అంగడి రైచూర్ లో టేకుల్ కోడు గ్రామానికి చెంగిన ఇద్దరు అనాథ పిల్లలకు బ్యాగులు బుక్కులు పంపిణీ చేయడం జరిగింది. అనదలైన అభిలాష్ ఒకటో తరగతి అనిల్ ఆరో తరగతి ఇద్దరు విద్యార్థులను అమ్మ నాన్న ఫౌండేషన్,నవీన ఆదర్శ స్కూల్ యాజమాన్యం ద్వారా అంగడి రైచూర్ గ్రామం లో ఉచిత విద్యను అందించడం జరుగుతుంది. గ్రామ సర్పంచి గ్రామ పెద్దలు ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయాలంటే ప్రతి ఒక్క వ్యక్తి యొక్క సహకారాలు అందించాలని తెలియజేయడం జరిగింది ఇలాంటి అనాథ పిల్లలకు అండగా ఉంటామని ఆయన ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ చందూర్, భాను,సర్పంచ్ కుమార్రి నాగప్ప, అనిల్, అంజి, శ్రీనివాస్ రెడ్డి, అనిల్ కుమార్, బుగ్గప్ప, ఉప సర్పంచ్, గ్రామస్తులు, ఫౌండేషన్ బృందంతో పాల్గొనడం జరిగింది.

# తగ్గిన దోపిడీలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్, హత్యలు

- 9శాతం పెరిగిన రికవరీ (2.45 కోట్ల రూపాయల విలువ గల చోరీ సొత్తు... రికవరీ
- సైబర్ నేరగాళ్లు దోచుకున్న 4.5 కోట్ల రూపాయలు బాధితుల ఖాతాలో జమ.. మరో 1.5 కోట్ల రూపాయలు హెూల్డ్
- ప్రాసిక్యూషన్, పోలీస్ అధికారుల సమన్వయంతో పెరిగిన దోషులకు శిక్ష శాతం... 11 కేసుల్లో జీవితఖైదు
- గంజాయి సేవించే వారిపై కేసులు నమోదు చేయడంతో గంజాయి సరఫరా కట్టడి
- స్వల్పంగా పెరిగిన రోడ్డు ప్రమాదాలు 928 ప్రమాదాలలో 332 మంది మృతి
- లోక్ ఆధాలాత్ ద్వారా 36,709 కేసుల పరిష్కారం...
- ఈ ఏడాదిలో 9792 కేసులు నమోదు..
- వార్షిక నివేదిక - 2025 వెల్లడించిన పోలీస్ కమిషనర్




**ఖమ్మం డిసెంబర్ 29 : ( సమయం న్యూస్ ) :** పోలీస్ యంత్రాంగం సమిష్టి కృషితో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు నియంత్రణలో వున్నాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదిక (--2025 ) ను పోలీస్ కమిషనర్ వెల్లడించారు .సమర్థవంతమైన పోలీసింగ్తో ఈ ఏడాది దోపిడీలు, ఇంటి దొంగతనాలు, చైన్ స్నాచింగ్, హత్యలు, హత్యాయత్నాలు వంటి ప్రధాన నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే చోరీ సొత్తు రికవరీ 9 శాతం, నేరాలను ఛేదించడం 11 శాతం పెరిగిందన్నారు. సైబర్ నెరగాళ్లు దోచుకున్న సుమారు 4.5 కోట్ల నగదును భాదితుల అకౌంట్లలోకి తిరిగి జమా అయ్యేలా చేయడంతో పాటు మరో 1.5 కోట్ల రూపాయలు హెూల్డ్ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. లోక్ ఆధాలాత్ ద్వారా 36,709 కేసుల పరిస్కారం లభించిందన్నారు.ప్రాసిక్యూషన్ అధికారులు, పోలీసుల సమన్వయంతో దోషులకు శిక్ష శాతం పెరిగిందన్నారు.ఈ ఏడాది జరిగిన 928 రోడ్డు ప్రమాదాలలో 332 మంది మృతి చెందారని, మరో 809 మంది గాయపడ్డారని తెలిపారు.గంజాయి సేవించే వారిపైన కేసులు నమోదు చేయడంతో గంజాయి సరఫరా కట్టడి చేశామన్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, నేరాలు జరిగే చోటుకు ఉన్నతాధికారులు పరిశీలనకు వెళ్లడం ద్వారా వాటి పరిష్కారంతో పాటు నేరాల కట్టడికి చర్యలు చేపట్టామన్నారు.పోలీస్ పెట్రోలింగ్, ఆకస్మిక వాహనాల తనిఖీ, కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాలు, ప్రజలతో సమన్వయం, ప్రధాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో అధికారులు, సిబ్బందికి శిక్షణ నిప్పించడం ద్వారా ఫింగర్ ప్రింట్స్, ఇతర ఆధారాల సేకరణ ద్వారా చోరీ సొత్తును రికవరీ చేయడంలో గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. చోరీ కేసుల్లో నిందితులను త్వరగా గుర్తించడం, వారి కదలికలపై నిఘా పెట్టడం, జైలు నుంచి విడుదలైన నేరస్థులపై నిఘా వేయడం ద్వారా ఘటనలను కట్టడి చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని, ప్రతి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. రోడ్డు ప్రమా దాల నియంత్రణలో భాగంగా బ్లాక్ స్పాట్ గా గుర్తించిన ప్రదేశాల్లో లోపాలను సరిదిద్ది సిగ్నల్ లైట్లు, బారికేడ్ల వినియోగం, రేడియం స్టిక్కర్లతో సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేశారు. విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మాదకద్ర వ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్ రావు, రామానుజం, ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, మహేష్, సర్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు

# రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి

- ఈ సీజన్లో ఇప్పటికే కేంద్రం నుండి 5.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా.
- గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికంగా యూరియా అమ్మకాలు.
- 5 జిల్లాల్లో ఫెర్టిలైజర్ యాప్ ప్రయోగం విజయవంతం.
- కేవలం 9 రోజుల్లో 2,01,789 బస్తాల యూరియా యాప్ ద్వారా రైతుల కొనుగోలు.
- జిల్లా కలెక్టర్లతో మంత్రి, చీఫ్ సెక్రటరీ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ
- యూరియా సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రానీయద్దు.




**నారాయణపేట, డిసెంబర్,29(సమయం న్యూస్):** రాష్ట్ర రైతులకు రబీ సీజన్ కోసం అవసరమైనంత యూరియా నిల్వలు రాష్ట్ర ప్రభుత్వ వద్ద పూర్తిగా అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపిణీలపై చీఫ్ సెక్రటరీ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ వీడియో కానారేన్స్ కలిసి మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కానారేన్స్ నిర్వహించారు.నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఈ రబీకి కేంద్ర ప్రభుత్వం మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు రావాల్సిన 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు.గత సంవత్సరం ఇదే సమయానికి 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, ఈ సీజన్లో రోజుకు సగటుగా 8,692 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని, ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికం అని మంత్రిగారు పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వగా ఉన్నట్లు తెలిపారు.వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ (యూరియా) యాప్ ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో డిసెంబర్ 20 నుండి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ ఐదు జిల్లాల్లో 82,059 మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసి 2,01,789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారు.యాప్ ప్రారంభించిన కేవలం 9 రోజుల్లోనే ఈ జిల్లాల్లో రోజుకు 22,000కు పైగా బస్తాలు పంపిణీ అయ్యాయని తెలిపారు.ఈ సందర్భంగా యూరియా యాప్ అమలులో ఉన్న జిల్లాల కలెక్టర్లతో మంత్రి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అప్పుడప్పుడు కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తున్నారని, రైతులు కూడా యూరియా యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. యాప్ అనేది కేవలం రైతుల సౌకర్యార్థం తెచ్చినది మాత్రమే, దీని ద్వారా యూరియా అమ్మకాలు పారదర్శకంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.ఇప్పటికే కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు పత్తి అమ్మకాలు సులభంగా చేసుకోగలుగుతు న్నారని, అదే దిశలో ఈ యాప్ ని తీసుకురావడం జరిగిందని తెలియజేశారు.యాప్ అమలులో ఉన్న జిల్లాలు కాని, అమలులో లేని జిల్లాలలో కాని యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.జిల్లాల వారీగా యూరియా స్టాక్, డిమాండ్, పంపిణీపై జిల్లా కలెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలని, అవసరమైతే అదనపు సేల్స్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.యూరియా పంపిణీపై మండల,డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాల్సిందిగా సూచించారు. యూరియా పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని, పర్యవేక్షణలో ఎటువంటి అలసత్వం ఉండకూడదన్నారు.రాష్ట్రంలో యూరియా లభ్యతపై రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మంత్రి స్పష్టం చేశారు.అదేవిధంగా రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్ లో టోల్ ఫ్రీ నెం. 18005995779 ఏర్పాటు చేయడమైనదని తెలియజేశారు.అనంతరం చీఫ్ సెక్రటరీ కే.రామకృష్ణ రావు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ఉదయాన్నే తెరిచేలా చర్యలు తీసుకోవాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకొని, సాయంతం జిల్లా అధికారులతో సమీక్ష చేయాలని, రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ గారు మాట్లాడుతూ.. ప్రతి సెంటర్లలో మూడు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, రైతుల సౌకర్యం కోసం శామియానా, త్రాగునీరు లాంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, కోఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు

## కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి

**కరీంనగర్ డిసెంబర్29( సమయం న్యూస్).:**జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి నేడొక ప్రకటన లో తెలిపారు.జిల్లా లో ఈ రోజు వరకు 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా కి 22,368 మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానా, త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఉదయం 6.00 గంటల నుండి కౌంటర్ వద్ద యూరియా సేల్స్ ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు మొక్క జొన్న సాగుకు సరిపోతాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని రైతులకు భరోసానిచ్చారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు.కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కలెక్టర్ అట్టి ప్రకటన లో కోరారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ డిసెంబర్29( సమయం. న్యూస్).:** అక్రమ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి , ఇంజనీరింగ్,పోలీస్,ఫారెస్ట్, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా ఇసుక కొనుగోలు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.ప్రభుత్వ నిర్మాణాల కోసం అవసరమైన ఇసుకను సాండ్ బజార్లో నిలవ చేస్తాం అన్నారు.ఇప్పటికే నర్సాపురంలో సాండ్ బజార్ ప్రారంభించడం జరిగిందని, మెదక్ లో తొందరలో ప్రారంభించుకోబోతున్నామని ఎక్కడ కూడా ఇసుక అక్రమ రవాణాకు తావు లేకుండా, యంత్రాలు ఉపయోగించి సాండ్ ను రవాణా చేసిన ఎడల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఎక్కడైతే ఇసుక అవసరం ఉంటుందో టీజీఎండిసి ద్వారా ద్వారానే కొనుగోలు చేయాలన్నారు సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఒక ఫార్మాట్ అందించడం జరిగిందని, ఇసుక అవసరాలను అందులో పొందుపరిచి అందజేయాలన్నారు .ఇలా చేయడం ద్వారా సాండ్ బజార్లో వారికి అవసరం అవసరానికి తగ్గట్టుగా ఇసుక అందుబాటులో ఉంచుతామన్నారు, ఇల్లీగల్ మైనింగ్ ఎక్కడ జరగకూడదాని, మైనింగ్ జరుగుతున్నట్లు ఇన్ఫర్మేషన్ ఉంటే తెలపండి చట్టాలకు అనుగుణంగాతక్షణం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు .ఇల్లీగల్ సాండ్ మైనింగ్ ల ఏరియాలలో సీసీటీవీ ల కెమెరా ల ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేపడుతున్నట్లు వివరించారు .వాటిని ఆధారాలుగా చేసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు.

ఫారెస్ట్ ల్యాండ్ నుంచి ఇసుక రవాణా జరుగుతుందని సమాచారం ఉందన్నారు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తనిఖీలు నిర్వహించి అటువంటి వారికి చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సాండ్ బజార్ ఆన్లైన్ ద్వారా అందుబాటులో ఉందని తప్పనిసరిగా అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవాల న్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం జరిగిందని ఆ ప్రాంతాలలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్యడిఆర్ఓ భుజంగరావు, ఆర్డిఓ రమాదేవి, నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, డి ఆర్ డి ఓ,శ్రీనివాసరావు,ఈడి మైన్స్ సంజయ్ కుమార్, డీఎస్పీపీ ప్రసన్నకుమార్, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ పోలీస్, పోలీస్,అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో యాసంగి అవసరాలకు సరిపడా అందుబాటులో యూరియా నిల్వలు

- రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు
- కలెక్టర్ పి. ప్రావీణ్య




**సంగారెడ్డి, డిసెంబర్ 29 ( సమయం న్యూస్).:** జిల్లాలో ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్ లో పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య భరోసా కల్పించారు. యూరియా కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ఎరువుల పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని సహకార సంఘాలలో యూరియా సహా ఇతర ఎరువులు అందుబాటులో ఉంచామని, పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు అందేవిధంగా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 4852 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సొసైటీలు, ఆగ్రో కేంద్రాలు, హెచ్ ఏ సి ఏ, డి సి ఎం ఎస్ కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు.యూరియా విడతల వారీగా సరఫరా చేయబడుతుందని, రైతులు ఎవరూ ఎటువంటి ఆందోళనకు లేదా అపోహలకు గురికావద్దని తెలిపారు.రేపటి( మంగళవారం) నుండి ఉదయం 6.00 గంటల నుండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డి సి ఎం ఎస్ కేంద్రాలు ఎరువుల విక్రయాలు ప్రారంభించేలా సూచించామని తెలిపారు.ఏదైనా కేంద్రంలో రద్దీ ఎక్కువగా ఉంటే, రైతులు ఎక్కువసేపు క్యూ లో వేచి ఉండకుండా మల్టిపుల్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అన్ని %ూాజా, సొసైటీలు మరియు అగ్రో కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా షామియానాలు ఏర్పాటు చేయ వలసిందిగాసంబంధిత అధికారులకు సూచించామని పేర్కొన్నారు.త్వరలో జిల్లాలో కూడా కోడ్ యాప్ ద్వారా రైతులకు ఎరువుల సరఫరా ప్రారంభించబడుతుందని తెలిపారు.రైతులందరూ ప్రశాంతంగా ఉండి, అవసర మైనప్పుడు మాత్రమే యూరియా కొనుగోలు చేయవలసిందిగా ఆమె కోరారు.

# సర్కార్ తోట భూమి పై తక్షణ నిర్ణయం తీసుకోవాలి


- 5 ఎకరాల మార్కింగ్ పూర్తైతే అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.

**రాయపోల్ డిసెంబర్ 14:**రాయపోల్ మండల కేంద్రంలోని సర్కార్ తోట భూమి విషయంలో ప్రస్తుతం గ్రామ పంచాయతీ గవర్నర్ పేరా రిజిస్టర్ చేసి ఉన్న 5 ఎకరాల భూమి వినియోగంపై నూతనంగా ఎన్నికైన పాలకవర్గం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎదురవుతున్న కీలక అం శాల్లో ఇదొకటిగా మారింది.రాయపోల్ మండలం ఏర్పడి దాదాపు 10 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాయపోల్‌లో ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాలు, పాడుబడ్డ ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. శాశ్వత ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరగకపోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.ఈ నేపథ్యంలో చట్టబద్ధంగా గ్రామ పంచాయతీకి రాసిచ్చిన 5 ఎకరాల భూమికి మార్కింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగిస్తే మండల కేంద్రంలో అవసరమైన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి మార్గం సుగమమయ్యే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.అయితే నిర్ణయం ఆలస్యం కావడంతో అభివృద్ధి పనులు ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి.5 ఎకరాల భూమిపై బౌండరీ మార్కింగ్ పూర్తయితే పరిపాలనా అవసరాలకు అనుగుణంగా కార్యాలయాల నిర్మాణం ప్రారంభమై,గ్రామానికి,మండల ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే అవకాశముంది. ప్రస్తుతం స్పష్టత ఉన్న భూమిని ముందుగా వినియోగంలోకి తీసుకురావడమే కీలకంగా మారిందన్న చర్చ సాగుతోంది.



# పరిశ్రమల స్థాపన కు అనుమతులు ఇవ్వండి.

**జిల్లా కలెక్టర్ డిసెంబర్29( సమయం న్యూస్) :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కానారేన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో యువతకి ఉద్యోగ ఉపాధి అందించడం కోసం పరిశ్రమలు స్థాపన ముఖ్యమైనదని. టీజీ - ఐ పాస్ లో వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు పెట్టుకున్న అన్ని ఆయా డిపార్ట్మెంట్ వారిగా వెరిఫై చెయ్యాలని ఒకవేళ యూనిట్ నెలకొల్పడానికి సుముఖంగా లేనియెడల డిలీట్ చెయ్యాలని తెలిపారు. అలాగే అన్ని పరిశ్రమల్లో కార్మికులకు ఇన్స్యూరెన్స్ చేయించాలనీ అధికారులను ఆదేశించారు. ఇండస్ట్రియల్ లో ప్రతి డిపార్ట్మెంట్ వారిగా అన్ని శాఖల అధికారులు తనిఖీలు చెయ్యాలని ఆదేశించారు. ఎక్కువ మంది కూలీలు పని చేసే పరిశ్రమల్లో సేఫ్టీ మెథడ్స్ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కమిటీలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, ఎల్డిఎం హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.




## 100% ఉద్యోగ అవకాశాలు కల్పించే ట్రైనింగ్స్ బయలుదేరిన భద్రాద్రి జిల్లా యువత.



**కొత్తగూడెం డిసెంబర్29( సమయం న్యూస్). :** జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఆద్వర్యంలో జిల్లాలో యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో LSC (Logistics Skill Council) మరియు Redington Foundation (COLTE) సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ %ు% 100% ప్లేస్ మెంట్ సపోర్ట్ ప్రోగ్రాం కు సెలెక్ట్ ఐన యువతి యువకులు (26) మందిని ఈ రోజు 28.12.2025 న కలెక్టరేట్ నుండి వారికోసం ప్రత్యేకంగా బస్ ఏర్పాటు చేసి హైదరాబాద్ ట్రైనింగ్స్ కు పంపించడం జరిగింది. ఈ సందర్భంగాగా కలెక్టర్ గారు మాట్లాడుతూ జిల్లా లోని పేద కుటుంబాలకు చెందిన యువతి యు-వకులు ఈ లాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రపంచం లో వేగంగా అభివృద్ధి చెందుతూ ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగం లాజిస్టిక్స్, ఎక్సపోర్ట్ % ఇంపోర్ట్ రంగమని, ఈ రంగంలో 100% ప్లేసెమెంట్ సపోర్ట్ ఉన్నందున ప్రతిఒక్కరు ట్రైనింగ్ తీసుకోని ఉద్యోగం పొందాలని, మీ కుటుంబ సభ్యులు గర్వ పడేలా, జిల్లాకు ఆదర్శవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గారు చూచించారు.

## భూభారతి దరఖాస్తులు పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ కే హైమావతి.




**సిద్ధిపేట డిసెంబర్29( సమయం న్యూస్).:** సోమవారం సాయంత్రం సమీక ృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కానారేన్స్ హాల్ లో భూ భారతి అప్లికేషన్స్ డిస్పోసల్, ఎలక్ట్రోరల్ మ్యాపింగ్ ప్రక్రియ గూర్చి ఆర్డీఓలు, తహసిల్దార్లతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్ష జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..భూ భారతి అవగాహన సదస్సులో మండలాల్లో స్వీకరించిన దరఖాస్తులను డిస్పోజల్ ప్రక్రియను ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనీ ఆరా తీసి డిస్పోసల్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని ఆదేశించారు.ఎలక్టోరల్ రోల్ మ్యాపింగ్ బిఎల్ఓ లు 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు. 18 సంవత్సరాల నిండిన ఓటరు వెరిఫై, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అన్ని పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి రోజు చేసిన మ్యాపింగ్ వివరాలు కంప్యూటర్ లో అప్లోడ్ చెయ్యాలని తెలిపారు. సూపర్ వైజర్ లు ఎల్లపుడు బిఎల్ఓ పని తీరును మానిటర్ చెయ్యాలి. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో జీపీఓలు, సూపర్ వైజర్లు, బూతు స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు.

## రబీ పంటకు సాగు జలాల అందించలేము

- సింగూరు ప్రాజెక్టు మరమ్మత్తుల సందర్భంగా ఘన్పూర్
- ఆయకట్టు (వనదుర్గ ప్రాజెక్ట్) ఆయకట్టుకు సంబంధించి
- ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు



**మెదక్ డిసెంబర్29( సమయం న్యూస్).:** సింగూరు పాజెక్టు యొక్క మరమ్మత్తుల దృశ్య ఘనపూర్ ఆనకట్టు (వనదుర్గ ప్రాజెక్టు) రబీ 2025-26 ఆయకట్టుకు సంభందించి సాగునీరు విడుదల చేయబడదని ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనదుర్గ ప్రాజెక్టు పరిదిలో గల కుల్చారం, మెదక్, హవేలీ ఘనపూర్ మరియు పాపన్నపేట్ మండలాలలోని ఆయకట్టు పరిధిలో గల రైతులు గమనించి సహకరించ గలరని మనవి చేశారుమరింత సమాచారం కొరకు ఆయా మండలాల్లోని ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించగలరనికోరారు.

## ప్రజావాణి కి 91 దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి డిసెంబర్29( సమయం న్యూస్) :** ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 91 దరఖాస్తులు వచ్చాయని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి ఆయా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పరిష్కారానికి అధికారులకు అర్జీలను ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు.ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



**పరిగి,మున్సిపల్(మం)డిసెంబర్,29(సమయం న్యూస్) :** పరిగి,వాసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చేకూరి సుభానయ్య (42) రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న సుభానయ్య మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో బసిరెడ్డిపల్లి గ్రామ ఆటో స్టాండ్ వద్ద తన ఆటోను నిలిపి రోడ్డు దాటుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది.ఈ సమయంలో బస్టాండ్ వైపు నుంచి అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన టీఎస్ 34 కె 2552 నంబర్ మోటార్ సైకిల్ సుభానయ్యను ఢీకొట్టింది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోవడంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే సుభానయ్యను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేయగా, వికారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సుభానయ్య మృతి చెందారు. ఈ ఘటనపై మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# అంకెల్లో ఆడంబరం

## ఆదిలాబాద్ శాంతిభద్రతల వాస్తవ చిత్రం!

**సమయం తెలంగాణ క్రైం రిపోర్ట్ :**

ఆదిలాబాద్ జిల్లా పోలీసు వార్షిక నివేదిక-2025 ఒక రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించాలని చూసినా, అందులోని గణాంకాలు రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. 2024లో 3,979 కేసులు ఉంటే, 2025లో అవి ఏకంగా 6,486కి చేరడం అంటే ఆదిలాబాద్ జిల్లాలో నేరాల రేటు 63 శాతం పెరగడమే. ఇది పోలీసుల చురుకుదనానికి నిదర్శనమని ఎస్పీ గారు చెబుతున్నా, నేరగాళ్లు ఎంతగా పెచ్చుమీరిపోతున్నారో అర్థమవుతోంది. నేరాల అదుపులో వైఫల్యాన్ని కేసుల నమోదు సంఖ్యతో కప్పిపుచ్చడం అంకెల గారడీ తప్ప మరొకటి కాదు. నివేదికలో చూపించే విజయాల కంటే, క్షేత్రస్థాయిలో ప్రజలు అనుభవిస్తున్న అభద్రతా భావమే తెలంగాణలో ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది.



**మారని లాఠీ మనస్తత్వం!**

నాడు కేసీఆర్ హయాంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' కేవలం అధికార పార్టీ కార్యకర్తలకు మాత్రమే పరిమితమైందనే విమర్శలు ఉండేవి. నేడు రేవంత్ రెడ్డి 'ప్రజా పాలన'లో కూడా సామాన్య దళితుడికి, గిరిజనుడికి పోలీసు స్టేషన్లలో దక్కుతున్న గౌరవం సున్నా. వ్యవస్థలో ముఖాలు మారుతున్నాయి కానీ, సామాన్యుడిని వేధించే లాఠీ మనస్తత్వం, అధికార పక్షానికి కొమ్ముకాసే ధోరణి మాత్రం ఇంచు కూడా మారలేదు. క్షేత్రస్థాయి పోలీసులు పాత పద్ధతులతోనే కాలం వెళ్లదీస్తూ, అక్రమ కేసులతో అమాయకులను వేధిస్తున్నారు. రేవంత్ రెడ్డి మార్పు నినాదం అదిలాబాద్ పోలీసు స్టేషన్ల గుమ్మం వద్దే ఆగిపోవడం అత్యంత దారుణం.

**మృత్యువుతో చెలగాటం!**

టెక్నాలజీ యుగంలో పోలీసులు వచ్చే సమయం తగ్గాల్సింది పోయి, గతేడాది కంటే పెరగడం పోలీసు వ్యవస్థ సోమరితనానికి పరాకాష్ట. ప్రాణం పోతుందన్న ఆపదలో 'డయల్ 100' కొడితే 8 నిమిషాల నిరీక్షణ అంటే అది మృత్యువుతో చేసే పోరాటం. అత్యవసర సేవలలో ఈ జాప్యం పోలీసు యంత్రాంగం యొక్క పర్యవేక్షణ లోపాన్ని ఎండగడుతోంది. కేవలం కాల్స్ సంఖ్య పెరిగిందని మురిసిపోవడం కాదు, ఆపదలో ఉన్న బాధితుడికి సకాలంలో అందే రక్షణే పోలీసుల అసలైన విజయం. సమయం పెరగడం వెనుక ఉన్న సిబ్బంది నిర్లక్ష్యంపై డీజీపీ గారు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అట్టర్ ఫ్లాప్ అదుపు!**

గంజాయి రహిత జిల్లా అని ప్రకటనలు గుప్పిస్తూనే, కేసులు 77 నుండి 174కి పెరగడం పోలీసుల వైఫల్యానికి సజీవ సాక్ష్యం. పాఠశాలల్లో కమిటీలు, 5కే రన్ లాంటి ప్రచార ఆర్భాటా లు జరుగుతున్నా, వీధి వీధినా మత్తు పదార్థాల లభ్యత పెరగడం సిగ్గుచేటు. గంజాయి సరఫరా చేసే అసలు తిమింగలాల జోలికి వెళ్లకుండా, కేవలం చిన్నచిన్న డీలర్లను పట్టుకొని 'రికార్డు' సృష్టిం చుకోవడం పోలీసుల ద్వి ముఖ నీతిని సూచిస్తోంది. యువత భవి ష్యత్తు చిన్నాభిన్నమవుతుంటే, పోలీసులు కేవలం అవగాహన సద స్సులకే పరిమితం కాకుండా, మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను కూక టివేళ్లతో సహా ఎప్పుడు ఛేదిస్తారో జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలి.

**రక్తసిక్త రహదారులు!**

బ్లాక్ స్పాట్లను గుర్తించామని, ఇంజనీరింగ్ మార్పులు చేశామని చెబుతున్నా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం పెరుగుతూనే ఉంది. కేవలం మాడిఫైడ్ సైలెన్సర్లను రోలర్లతో తొక్కించి సోషల్ మీడియాలో పబ్లిసిటీ చేసుకోవడం తప్ప, వాస్తవంగా ప్రమాదాలు అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారు. ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం రోడ్డున పడుతుంటే, నిబంధనలు అమలు చేయడంలో ఉదాసీనత వహించడం నేరం కాదా? ట్రాఫిక్ క్రమశిక్షణ కేవలం చలాన్ల వసూళ్లకే పరిమితం కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా ఉండాలి. ప్రచార ఆర్భాటాలు మృత్యువును ఆపలేవని జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా గుర్తించాలి.

**దళిత రక్షణలో వివక్ష!**

వడ్డీ వ్యాపారుల అరాచకాలు, విడిసిల సామాజిక బహిష్కరణలు దళితుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నా పోలీసులు రాజీ మార్గాలు వెతకడం అన్యాయం. అక్రమ కేసులతో దళితుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు విరుద్ధం. ఆదిలాబాద్ నివేదిక కేవలం ప్రశంసల కోసం కాకుండా, ఆత్మవిమర్శ కోసం ఉండాలి. మారుమూల ఆదివాసీలకు దుప్పట్లు పంచితే సరిపోదు, వారి భూములను, హక్కులను దోచుకునే శక్తులపై ఉక్కుపాదం మోపాలి. డీజీపీ గారు ఈ గణాంకాల వెనుక ఉన్న అరాచక వాస్తవాలను గుర్తించి, ఆదిలాబాద్ పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. బాధితుడికి న్యాయం జరిగిన రోజే అది పోలీసుల నిజమైన విజయం.



# రెండు రోజులు మాత్రమే ఛాన్స్.. లేదంటే ఇబ్బందులు తప్పవు..




మన దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు, పాన్ కార్డు చాలా ముఖ్యం. ఈ రెండు కార్డులు లేకుంటే ప్రభుత్వ పథకాలు పొందడంలో గానీ, గుర్తింపు విషయంలో గానీ, ట్రాన్సాక్షన్స్ విషయంలో గానీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే.. ప్రతి భారతీయ పౌరుడు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తప్పనిసరిగా కలిగి ఉంటాడు. అయితే, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ప్రతి ఒక్కరూ ఆధార్, పాన్ కార్డులను లింక్ చేయాల్సి ఉంది. ఈ లింకింగ్ ప్రాసెస్ ఉచితంగా చేసుకోవడానికి మరో రెండు రోజులు మాత్రమే అవకాశం ఉంది. ఈ గడువు దాటితే పాన్ కార్డ్, ఆధార్ కార్డు ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిర్ణీత గడువులోగా పాన్-ఆధార్ కార్డ్ లింక్ చేయకపోతే పాన్ కార్డ్ సేవల్లో అంతరాయం ఏర్పడటం గానీ, ఆర్థిక లావాదేవీల నిలుపుదల, ఇతర సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే వీలైనంత త్వరగా పాన్-ఆధార్ కార్డ్ లింక్ చేసుకోండని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి.

**గడువు దాటితే ఏమవుతుంది..?**

ఏప్రిల్ 3, 2025న ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం అక్టోబర్ 1, 2024న లేదా ఆ తరువాత పాన్ కార్డులు పొందిన వారు డిసెంబర్ 31, 2025 లోపు తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలి. నిర్ణీత తేదీ కంటే ముందుగా పాన్ కార్డ్ తీసుకున్న వారికి లింక్ కోసం గడువును మే 31, 2024 వరకు మాత్రమే ఇచ్చింది ఆదాయపు పన్ను శాఖ. ఒకవేళ నిర్ణీత గడువులోగా ఆధార్-పాన్ కార్డు లింక్ చేయకపోవడం ఆర్థిక పరమైన లావాదేవీలు నిలిపివేయడం, ప్రభుత్వ పథకాలకు సంబంధించి యాక్సెస్ ఉండదు. అలాగే గడువు ముగిసిన తరువాత పాన్-ఆధార్ లింక్ చేయడానికి రూ. 1000 ఛార్జీ చేయబడుతుంది. గడువులోగా లింక్ చేసుకోవడానికయితే ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదు.

**పాన్-ఆధార్ లింక్ చేయకపోతే..**

నిర్ణీత గడువులోగా పాన్ కార్డ్-ఆధార్ కార్డు లింక్ చేయకపోతే.. ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడం కష్టమవుతుంది. రిఫండ్‌లు నిలిచిపోయే అవకాశం ఉంది. పన్ను చెల్లింపులకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమవుతాయి. టీడీఎస్, టీసీఎస్ రేట్లు ఎక్కువగా పడే అవకాశం ఉంటుంది. అలాగే, పన్ను చెల్లింపుదారులు ఫామ్ 26ఏఎస్ కు యాక్సెస్‌ను కోల్పోయే అవకాశం ఉంది. టీడీఎస్, టీసీఎస్ సర్టిఫికెట్ పొందడంలో కష్టంగా ఉంటుంది.

బ్యాంకింగ్ పనులు, ఆర్థిక లావాదేవీలు కూడా ప్రభావితమవుతాయి. పాన్ కార్డ్ సేవలకు అంతరాయం ఏర్పడటం వలన బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయలేరు. క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డులను పొందలేరు. రూ. 50,000 కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేయలేరు. అలాగే రూ. 10,000 కంటే ఎక్కువ బ్యాంకు లావాదేవీలను నిర్వహించలేరు. కేవైసీ చేయడంలోనూ ఇబ్బందులు వస్తాయి. ప్రభుత్వ సేవలు పొందడంలోనూ కష్టతరమవుతుంది. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలలో పెట్టుబడులు నిలిపివేసే అవకాశం ఉంది. ఇలా అనేక రకాల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున నిర్ణీత గడువులోగా అంటే డిసెంబర్ 31వ తేదీలోపు పాన్ కార్డ్-ఆధార్ కార్డ్ తప్పకుండా లింక్ చేయండి.

# రోజూ రూ.10 తో డైలీ సిప్ పెట్టుబడులు పెట్టే అవకాశం

భారత్‌లో పెట్టుబడి సంస్కృతిని పెంచేందుకు ఫోన్‌పే వెల్త్ ప్లాట్‌ఫాం కొత్త అధ్యాయం ప్రారంభించింది. రోజుకు కేవలం రూ. 10 నుంచి మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టే 'డైలీ SIP (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ఫీచర్‌ను పరిచయం చేసింది.

ఈ ఫీచర్ ద్వారా సామాన్యులు కూడా సులభంగా దీర్ఘకాలిక ధన సృష్టికి బాటలు వేసుకోవచ్చు. ఫోన్‌పే యాప్‌లో UPI ఆటోపే ద్వారా ఆటోమాటిక్‌గా రోజువారీ పెట్టుబడులు చేయవచ్చు. ఈక్విటీ, గోల్డ్, మల్టీ-ఆసెట్ వంటి వివిధ ఫండ్లలో రిస్క్ స్థాయి ఆధారంగా ఎంచుకోవచ్చు. ఎప్పుడైనా మొత్తాన్ని పెంచడం, తగ్గించడం, పాజ్ చేయడం లేదా ఆపడం కూడా సాధ్యమే.




భారత మ్యూచువల్ ఫండ్ రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. అక్టోబర్ 2025లో నెలవారీ SIPలు రూ. 29,000 కోట్లు దాటాయి (AMFI డేటా). గత 5 ఏళ్లలో 30% వార్షిక వృద్ధి చెంది.. ఇప్పుడు 9.45 కోట్ల SIP అకౌంట్లు ఉన్నాయి. రూపీ కాస్ట్ యావరేజింగ్ ద్వారా మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ లభిస్తుందని ఫోన్‌పే వెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ హెడ్ నీలేష్ డి. నాయక్ తెలిపారు. ఫోన్‌పే వెల్త్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (SEBI రిజిస్టర్డ్) ద్వారా స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లు, వెల్త్ బాస్కెట్లు అందిస్తోంది.

# రక్షణ రంగంలో అదానీ గ్రూప్ రూ. 1.8 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు

అదానీ గ్రూప్ భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి భారీ పెట్టుబడులు పెట్టనుంది. రక్షణ ఉత్పత్తుల తయారీలో రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని గ్రూప్ యోచిస్తోందని సమాచారం. మానవరహిత అటానమస్ వ్యవస్థలు (యూఏవీలు), అడ్వాన్స్డ్ గైడెడ్ ఆయుధాలు, సెన్సర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీపై ఈ సంస్థ ప్రధాన దృష్టి సారించనుంది.

అలాగే కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కార్యకలాపాలు, విమాన ఇంజిన్ల నిర్వహణ-మరమ్మతు-ఓవర్‌హాలింగ్ (ఎంఆర్ఓ), శిక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై పనిచేయనుంది. అటానమస్ వ్యవస్థల వల్ల యుద్ధాల్లో సైనికుల ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చనేది అదానీ గ్రూప్ ఆలోచన.




ఈ ఏడాది గ్రూప్ రూపొందించిన 'ద్రిష్టి-10' యూఏవీలు ఇప్పటికే భారత నౌకాదళంలో చేరాయి. ఇవి నిఘా, పరిశీలన, ప్రత్యర్థి కదలికలను గుర్తించడంలో ఉపయోగపడుతున్నాయి.

అదానీ తయారు చేసిన ప్రత్యర్థి డ్రోన్లను పసిగట్టే వ్యవస్థలపై రక్షణ బలగాల పరీక్షలు పూర్తయ్యాయి. 2026లో అటానమస్ వ్యవస్థల ఉత్పత్తిని మరింత పెంచనుంది. ఈ పెట్టుబడులతో భారత్ రక్షణ రంగంలో స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) లక్ష్యానికి దగ్గరవుతుందని భావిస్తున్నారు.



# అండర్- 19 వరల్డ్‌కప్ కెప్టెన్‌గా ఆయూశ్ మాత్రే

## అండర్- 19 వరల్డ్‌కప్ భారత్ జట్టు ప్రకటన

2026 అండర్ 19 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు భారత జట్టును బీసీసీఐ తాజాగా ప్రకటించింది. 15 మందితో కూడిన జట్టును బోర్డు శనివారం అనౌన్స్ చేసింది. ఈ జట్టుకు ఆయూశ్ మాత్రే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. విహాన్ మల్హోత్ర వైస్ కెప్టెన్‌గా ఎంపికైయ్యాడు. ఈ జట్టులో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఉన్నాడు. అయితే వరల్డ్‌కప్ కంటే ముందు యంగ్ టీమ్ఇండియా, సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లో ఆడనుంది. ఆ సిరీస్‌కు కూడా ఇదే జట్టుతో భారత్ బరిలోకి దిగనుంది. కాగా, ఈ వరల్డ్‌కప్ టోర్నమెంట్ జనవరి 15న ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 06న ఫైనల్‌తో ముగుస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. 5సార్లు ఛాంపియన్ అయిన టీమ్ఇండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. భారత్ గ్రూప్ బీలో ఉంది. భారత్‌తోపాటు ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్, యుఎస్‌ఏ మరియు బంగ్లాదేశ్ ఉన్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్ సహా 16 జట్లు పాల్గొననున్నాయి. ఈ జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ముందుగా గ్రూప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. తర్వాత ఆ తర్వాత సూపర్ సిక్స్ దశ మ్యాచ్‌లు ఉంటాయి. ఆ తర్వాత సెమీ-ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఫైనల్ మ్యాచ్‌లు హరారే ఆతిథ్యమివ్వనుంది. ఈ వరల్డ్‌కప్‌లో భారత్ తన తొలి మ్యాచ్ %ఖూూూ%తో ఆడనుంది. జనవరి 15న బులావాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత కూడా అదే వేదికపై 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో టీమ్ఇండియా గ్రూప్ మ్యాచ్‌లు ఆడనుంది. కాగా, అండర్ 19 వరల్డ్‌కప్‌లో టీమ్ఇండియా ఇప్పటిదాకా ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022 ఎడిషన్లలో భారత్ టైటిళ్లు నెగ్గింది. నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచింది. ఆయుశ్ మత్రే, విహాన్ మల్హోత్ర ఇద్దరు ఆటగాళ్లు మణికట్టు గాయాలకు గురయ్యారు. దీంతో దక్షిణాఫ్రికా పర్యటనకు ఈ ఇద్దరూ దూరం కానున్నారు. దీంతో ఈ సిరీస్‌కు వైభవ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇక ఆయూశ్, విహాన్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కొన్ని రోజులు ఉండి చికిత్స తీసుకుంటారు. అయితే అండర్- 19 ప్రపంచ కప్ సమయానికి మళ్లీ ఈ ఇద్దరూ జట్టులో చేరతారు. భారత్‌కు ఇప్పటికాదా ఐదుగురు కెప్టెన్లు అండర్ - 19 టైటిల్ అందించారు. గతంలో మహ్మద్ కైఫ్ (2000), విరాట్ కోహ్లీ (2008), ఉన్ముక్త్ చంద్ (2012), పృథ్వీ షా (2018), యష్ దుల్ (2022) టీమ్ఇండియాను ఛాంపియన్‌గా నిలిపారు. ఇప్పుడు ఈ లిస్ట్‌లో ఆయూశ్ మాత్రే కూడా చేరాలని టీమ్ఇండియా ఫ్యాన్స్ భావిస్తున్నారు.

భారత యు19 జట్టు : ఆయుశ్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వాన్ష్ సింగ్ (వికెట్ కీపర్), అంబరీష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ ఎ. పటేల్, మహ్మద్ ఈనాన్, హెనిల్ పటేల్, డి. దీపేష్, కిషన్ కుమార్ సింగ్, ఉదవ్ మోహన్

# రవి సింగ్ రికార్డు ఇన్నింగ్స్

విజయ్ హజారే ట్రోఫీలో సిక్సర్ల సునామీ కొనసాగుతోంది. ఐపీఎల్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని సైతం వెనక్కి నెట్టి రైల్వేస్ వికెట్ కీపర్ బ్యాటర్ రవి సింగ్ కొత్త సిక్సర్ కింగ్‌గా అవతరించాడు. కేవలం మూడు ఇన్నింగ్స్‌ల్లోనే ఏకంగా 19 భారీ సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. లెఫ్ట్ హ్యాండ్ కలిగిన ఈ పవర్‌ఫుల్ బ్యాటర్ తన వినాశకరమైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు పీడకలలా మారాడు. ఈ సీజన్ విజయ్ హజారే ట్రోఫీలో రవి సింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. సర్వీసెస్ జట్టుతో జరిగిన తాజా మ్యాచ్‌లో కేవలం 46 బంతుల్లోనే 88 పరుగులు సాధించాడు. ఇందులో ఏకంగా 7 సిక్సర్లు ఉన్నాయి. అంతకుముందు వైభవ్ సూర్యవంశీ 16 సిక్సర్లతో టాప్‌లో ఉండగా, ఇప్పుడు రవి సింగ్ ఆ రికార్డును దాటి 19 సిక్సర్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. కేవలం మూడు ఇన్నింగ్స్‌ల్లోనే 273 పరుగులు చేసిన రవి సింగ్ సగటు 136.5గా ఉండటం విశేషం. అతని స్ట్రైక్ రేట్ 138కి పైగా ఉండటం చూస్తుంటే, వన్డే మ్యాచ్‌ను కూడా టీ20లా మార్చేస్తున్నాడని అర్థమవుతోంది. రవి సింగ్ ఫామ్ చూస్తుంటే ఎవరూ అతడిని ఆపలేకపోతున్నారు. హర్యానాతో జరిగిన మ్యాచ్‌లో 81 బంతుల్లోనే అజేయమైన 109 పరుగుల సెంచరీతో రైల్వేస్ జట్టును గెలిపించాడు. ఆ తర్వాత బలమైన ఆంధ్రప్రదేశ్ జట్టుపై 70 బంతుల్లో 76 పరుగులు చేసి తన నిలకడను చాటుకున్నాడు. తాజాగా సర్వీసెస్‌పై 46 బంతుల్లోనే 88 పరుగులు బాది తన విధ్వంసకర ఇన్నింగ్స్‌ల పరంపరను కొనసాగించాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ రవి సింగ్ 50కి పైగా పరుగులు సాధించడం విశేషం. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు రవి సింగ్ ప్రతిభను గుర్తించి 95 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. యూపీ టీ20 లీగ్‌లో కూడా రవి తన పవర్ హిట్టింగ్‌తో ఆకట్టుకున్నాడు. వికెట్ కీపింగ్‌తో పాటు మ్యాచ్‌ను ఫినిష్ చేయగల సత్తా ఉండటంతో ఐపీఎల్ 2026 సీజన్లో అతడు రాజస్థాన్ జట్టులో కీలక ఆటగాడిగా మారే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లతో కలిసి రవి సింగ్ ఐపీఎల్ గ్రౌండ్లలో సిక్సర్ల వర్షం కురిపిస్తాడని ఫ్యాన్స్ ఆశగా ఎదురుచూస్తున్నారు. రవి సింగ్ ఇన్నింగ్స్‌లు రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్‌ను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. ఈ స్థాయి ఫామ్‌ను కొనసాగిస్తే త్వరలోనే టీమ్ ఇండియా తలుపులు తట్టడం ఖాయం. అద్భుతమైన టైమింగ్, భీకరమైన పవర్ తో బంతిని స్టాండ్స్ లోకి పంపడంలో రవి సింగ్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్ లో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారాడు.

# కెప్టెన్‌గా మళ్లీ రోహిత్‌శర్మ..?

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తిరిగి వన్డే సారథ్య బాధ్యతలు చేపట్టబోతున్నాడా? టీ20 జట్టు నుంచి తప్పించిన శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్సీపై వేటు పడనుందా? అంటే సోషల్ మీడియాలో అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఏడాదే కెప్టెన్‌గా రోహిత్ శర్మ ప్రయాణానికి తెరదించుతూ.. కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ నియమించిన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియా పర్యటనతో శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. వన్డే ప్రపంచకప్ 2027 నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అప్పట్లో సెలెక్టర్లు వివరణ ఇచ్చారు. వన్డే ప్రపంచకప్ 2027 వరకు కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగడంపై సందేహాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొత్త సారథిని సిద్ధం చేయాలనుకున్నామని చెప్పారు. శుభ్‌మన్ గిల్‌కు వన్డే సారథ్య బాధ్యతలు అప్పగించారు. అయితే శుభ్‌మన్ గిల్ ఇటీవల పేలవ ఫామ్‌తో పాటు ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు. దాంతో అతను టీ20 ప్రపంచకప్ 2026 ఎంపిక చేయలేదు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. ముఖ్యంగా మిడిలార్డర్‌ను బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఈ క్రమంలో ఓ సోషల్ మీడియా పోస్ట్ నెటిజన్లలో గందరగోళం సృష్టించింది. రోహిత్ శర్మను తిరిగి భారత వన్డే సారథిగా నియమించేందుకు బీసీసీఐ సిద్ధమైందని, ఇప్పటికే ఈ విషయమై రోహిత్ శర్మతో మాట్లాడిందని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియాను రోహిత్ శర్మనే నడిపించబోతున్నాడని పేర్కొన్నారు. 'కెప్టెన్ రోహిత్ శర్మ ఈజ్ బ్యాక్. సెలెక్టర్లు అతనితో మాట్లాడుతున్నారు. ప్రపంచకప్ నేపథ్యంలో వన్డే సారథ్య బాధ్యతలు చేపట్టాలని కోరుతున్నారు.'అని ఆ పోస్ట్‌లో తెలిపారు.

### 50 రికార్డులు నెలకొల్పిన రోహిత్ శర్మ

రోహిత్ శర్మకు 2025 సంవత్సరం అద్భుతంగా కలిసొచ్చింది. అతడి కెప్టెన్సీలో భారత్‌కు ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను అందించాడు. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై రోహిత్ 76 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అందుకుగానూ అతనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రోహిత్ శర్మ ఈ ఏడాది షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న ఒక పెద్ద రికార్డును బద్దలు కొట్టాడు. పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్ గత 10 సంవత్సరాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ నిలిచాడు. రోహిత్ ఖాతాలో ప్రస్తుతం 355 వన్డే సిక్స్‌లు ఉన్నాయి. అఫ్రిది 351 సిక్స్‌లు కొట్టాడు. రోహిత్ శర్మ సేనా దేశాలలో (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అతను మొత్తం 14 వన్డే సెంచరీలు సాధించాడు. భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్ (15,933). ఓపెనర్‌గా భారత్ తరపున సంయుక్తంగా అత్యధిక సెంచరీలు (45). సచిన్ సైతం ఓపెనర్‌గా ఇదే రికార్డ్.



# నెహ్రూ స్టేడియం కూల్చివేతకు గ్రీన్ సిగ్నల్



అసోం క్రీడా చరిత్రలో ఒక శకం ముగియబోతోంది. దాదాపు 60 ఏళ్ల పాటు ఎన్నో అద్భుత ఘట్టాలకు వేదికగా నిలిచిన గువాహటిలోని నెహ్రూ స్టేడియం త్వరలోనే కనుమరుగు కానుంది. అసోం క్రీడలకు ఒక గుండెలా నిలిచిన ఈ స్టేడియాన్ని పూర్తిగా కూల్చివేసి, దాని స్థానంలో అత్యాధునిక హంగులతో కొత్త స్టేడియాన్ని నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ భారీ మార్పుకు అసోం క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. పాత జ్ఞాపకాలను చెరిపేసి సరికొత్త ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా దీన్ని మార్చబోతున్నారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాలను పూర్తిగా తొలగించి, ఫిఫా అలాగే ఒలింపిక్ ప్రమాణాలకు తగ్గట్లుగా ఈ కొత్త స్టేడియాన్ని తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం అసోం ప్రభుత్వం ఏకంగా రూ. 765 కోట్లు కేటాయించింది. ఈ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి దక్కించుకుంది. పాత స్టేడియం స్థానంలో ఫుట్ బాల్ గ్రౌండ్, ప్రాక్టీస్ ఫీల్డ్స్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ వంటి ఆధునిక సౌకర్యాలు రాబోతున్నాయి. అయితే కొత్త స్టేడియానికి పేరు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అసలు ఈ స్టేడియం కథ 1962లో మొదలైంది. 1962 జూలై 16న అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరు మీద దీన్ని ప్రారంభించారు. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ స్టేడియం అప్పట్లో ఈశాన్య భారతంలోనే అతిపెద్ద ఔట్ డోర్ స్టేడియంగా పేరు తెచ్చుకుంది. అసోం క్రికెట్ అసోసియేషన్‌కు, అక్కడి క్రీడాకారులకు ఇది ఎంతోకాలం ప్రధాన కేంద్రంగా సేవలు అందించింది. రాధా గోవింద బారువా వంటి ప్రముఖులు దీని నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. క్రికెట్ అభిమానులకు ఈ స్టేడియంతో విడదీయరాని అనుబంధం ఉంది. 1983లో ఇక్కడ భారత్, వెస్టిండీస్ మధ్య తొలి వన్డే మ్యాచ్ జరిగింది. మొత్తంగా 14 అంతర్జాతీయ వన్డేలకు ఈ మైదానం ఆతిథ్యం ఇచ్చింది. సచిన్ తెందూల్కర్, కపిల్ దేవ్, సునీల్ గావస్కర్, వివియన్ రిచర్డ్స్, సౌరభ్ గంగూలీ వంటి దిగ్గజాలు ఇక్కడ ఆడారు. చివరిసారిగా 2010లో భారత్- న్యూజిలాండ్ మధ్య ఇక్కడ మ్యాచ్ జరిగింది. కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా ఫుట్ బాల్ చరిత్ర కూడా ఈ స్టేడియానికి ఉంది. కేవలం క్రికెట్, ఫుట్‌బాల్ మాత్రమే కాకుండా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీ, జూడో వంటి అనేక క్రీడలకు ఇది ప్రధాన వేదికగా నిలిచింది. అసోం స్పోర్టింగ్ లైఫ్‌కు ఇది సెంటర్ పాయింట్ అని చెప్పవచ్చు. క్రీడలతో పాటు లతా మంగేష్కర్, మహమ్మద్ రఫీ వంటి గాయకుల కచేరీలు, రాజకీయ సభలు కూడా ఇక్కడ జరిగాయి. గత ఆరు దశాబ్దాలుగా అసోం ప్రజల సామాజిక జీవితంలో ఈ నెహ్రూ స్టేడియం ఒక భాగమైపోయింది. ఇప్పుడు పునర్నిర్మాణ పనుల కోసం డిసెంబర్ 25 లోపు స్టేడియం కాంప్లెక్స్‌లోని ఆఫీసులన్నీ ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్తగా రాబోయే స్టేడియంలో సుమారు 25 వేల మంది కూర్చునే సామర్థ్యం ఉంటుంది. ఆడిటోరియం, స్పోర్ట్స్ హాస్టల్, కమర్షియల్ స్పేస్ లు కూడా ఇందులో ఉంటాయి. పాత స్టేడియం కూలిపోయినా, అది మిగిల్చిన క్రీడా జ్ఞాపకాలు మాత్రం చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి.

# సొంత బోర్డుపై దావా వేసిన సౌతాఫ్రికా క్రికెటర్!



సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు (సీఎస్‌ఏ)పై ఆ జట్టు సీనియర్ ప్లేయర్ తబ్రైజ్ షమ్సీ దావా వేసాడు. ఈ న్యాయ పోరాటంలో అతనికి అనుకూలంగా తీర్పు రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక ఆటగాడు తమ సొంత బోర్డుపై న్యాయ పోరాటం చేసి ఊరట పొందడం ఇదే తొలిసారి. యూఏఈ వేదికగా జరుగుతున్న ఐఎల్‌టీ20లో ఆడేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ) గడువును పెంచాలని కోరుతూ షమ్సీ దాఖలు చేసిన పిటిషన్‌పై జోహన్నెస్‌బర్గ్ హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. షమ్సీ ఈ ఏడాది ఆరంభంలోనే సౌతాఫ్రికా20 ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్‌తో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాడు. ఆ తర్వాత ఆయన గల్ఫ్ జెయింట్స్ తరఫున ఐఎల్‌టీ20 ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఐఎల్‌టీ20 ఆడేందుకు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు ఎన్‌ఓసీ జారీ చేసింది. కానీ డిసెంబర్ 19 వరకే ఇచ్చింది. జనవరి 4న జరిగే ఐఎల్‌టీ20 ఫైనల్ వరకు ఆడేందుకు అతనికి అనుమతి నిరాకరించింది. సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుతో షంసీ జరపిన చర్చలు సఫలం కాకపోవడంతో అతను హైకోర్టును ఆశ్రయించాడు. అతని పిటిషన్‌ను విచారించిన కోర్టు జనవరి 4 వరకు ఎన్‌ఓసీని పొడిగించడమే కాకుండా.. షమ్సీకి అయిన లీగల్ ఖర్చులను కూడా చెల్లించాలని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డును ఆదేశించింది. ఈ తీర్పుపై షమ్సీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. 'కోర్టు నా పరిస్థితిని అర్థం చేసుకుని ఊరటనిచ్చినందుకు కృతజ్ఞతలు. బోర్డుపై కేసు వేయడం నాకు ఇష్టం లేదు. కానీ నా కెరీర్, కుటుంబ భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయం తప్పలేదు. ఇది కేవలం డబ్బు కోసం చేస్తున్న పని కాదు. నా వృత్తిపరమైన బాధ్యతలను నెరవేర్చుకోవడం కోసమే. నేను ఇప్పటికీ సౌతాఫ్రికా జట్టుకు ఆడేందుకు సిద్ధంగానే ఉన్నాను.'అని షంసీ తెలిపాడు. షమ్సీ ILT20 ముగిసిన వెంటనే ఆస్ట్రేలియాలో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో పాల్గొనేందుకు కూడా బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొందాడు.

# టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్‌శర్మ విధ్వంసం


టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసం సృష్టించాడు. జైపూర్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఈ వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 60 నిమిషాల వ్యవధిలో ఏకంగా 45 సిక్సర్లు బాది ప్రత్యర్థి బౌలర్లకు ముందస్తు హెచ్చరికలు పంపాడు. విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిషేక్ శర్మ.. ఆదివారం ఉదయం జైపూర్ శివార్లలోని క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేశాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ శర్మ సిక్సర్ల సునామీ సృష్టించాడు. బౌలర్లపై 'రుద్ర తాండవం' చేశాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ శర్మ హిట్టింగ్‌పైనే దృష్టి సారించాడు. సుమారు గంట పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన అభిషేక్ శర్మ.. ఒక్క బంతిని కూడా డిఫెండ్ చేయలేదు. ఆఫ్-స్పిన్, లెగ్-స్పిన్ అని తేడా లేకుండా బౌలర్లు వేసిన బంతులని స్టాండ్స్‌లోకి పంపాడు. అభిషేక్ శర్మ సిక్సర్ల ధాటికి కనీసం 5 బంతులు మైదానానికి ఆనుకుని ఉన్న అపార్ట్‌మెంట్స్‌లో పడ్డాయి. ముఖ్యంగా 'ఎక్స్‌ట్రా కవర్' దిశగా అభిషేక్ ఆడిన ఇన్ సైడ్-ఔట్ షాట్లు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. అభిషేక్ పూర్తిగా ఎక్స్‌ట్రా కవర్ మీదుగా సిక్సర్లు బాదడంతో పంజాబ్ హెడ్ కోచ్ సందీప్ శర్మ పంజాబీలో సరదాగా స్పందించాడు. 'ఏంటి అభిషేక్.. ఎక్స్‌ట్రా కవర్ సిక్సర్లతోనే సెంచరీ చేస్తావా?'అని చమత్కరించగా.. అభిషేక్ తనదైన శైలిలో నవ్వుతూ మరో సిక్సర్‌తో బదులిచ్చాడు. ప్రాక్టీస్ మొదలైన 10 నిమిషాలకే అభిషేక్ తన హిట్టింగ్ మొదలుపెట్టాడు. సహచర ఆటగాడు గౌరవ్ చౌదరిని "ఫీల్డింగ్ సెటప్ ఎలా ఉంది?" అని ఒక ఊహాత్మక ప్రశ్న అడిగి, దానికి అనుగుణంగా బంతిని స్టాండ్‌కు తరలించాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఈ గంట సేపట్లో ఆయన కేవలం 3 లేదా 4 సార్లు మాత్రమే ఔట్ అయ్యారు. అది కూడా డిఫెన్స్ ఆడటానికి ప్రయత్నించినప్పుడే కావడం గమనార్హం. 25 ఏళ్ల అభిషేక్ శర్మ చూపించిన ఈ విధ్వంసం రాబోయే అంతర్జాతీయ మ్యాచుల్లో టీమిండియా పవర్ ప్లేలో ఏ రేంజ్‌లో చెలరేగబోతుందో చెప్పడానికి సంకేతం. న్యూజిలాండ్‌తో జరగబోయే అప్‌కమింగ్ టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ ఈ దూకుడు కొనసాగించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



# రాజాసాబ్‌పై భారీ అంచనాలు

## రాజాసాబ్ నుంచి మరో ట్రైలర్ విడుదల

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, ఇటీవల గ్రాండ్‌గా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. 'బాహుబలి', 'సలార్', 'కల్కి' లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాలతో ప్రభాస్ స్టార్‌డమ్ మరో స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. అయితే ప్రభాస్‌లోని కామెడీ టైమింగ్‌ను వెండితెరపై చూసి చాలా కాలమే గడిచిపోయింది. చివరిసారిగా 'డార్లింగ్' చిత్రంలో ప్రభాస్ తన ఫన్ యాంగిల్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు. దాదాపు 15 ఏళ్ల తర్వాత, మళ్లీ అదే స్థాయిలో కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రభాస్ కనిపించనున్నాడనే టాక్‌తో 'రాజా సాబ్'పై అంచనాలు భారీగా పెరిగాయి. పండగ సీజన్‌లో విడుదల కావడంతో ఈ సినిమా ఓ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలవనుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా, 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జరిగిన ఓ ఆసక్తికర ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న మారుతి కుమార్తె హియా దాసరి, ఈవెంట్‌లో ప్రభాస్‌ను పలకరిస్తున్న వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ప్రభాస్ కూర్చుని ఉండగా వెనుక నుంచి వచ్చిన హియాను ఆయన ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుని మాట్లాడిన తీరు అభిమానుల మనసులను గెలుచుకుంది. ఈ మధురమైన క్షణాలను హియా స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, 'హీరో గారు? మీరు నిజంగా ఎంతో మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి' అంటూ ఎమోషనల్ పోస్ట్ చేసింది. దీనిపై దర్శకుడు మారుతి కూడా లవ్ ఎమోజీలతో రియాక్ట్ అయ్యారు. అంతేకాదు, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ కూడా ఈ పోస్ట్‌పై స్పందించడం విశేషం. 'రాజా సాబ్' చిత్రంలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఫన్, రొమాన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం, ప్రభాస్ అభిమానులకు నిజమైన పండగ కానుక అవుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే? 'డార్లింగ్' తర్వాత ప్రభాస్ కామెడీ మ్యాజిక్‌ను 'రాజా సాబ్' ఎంత స్థాయిలో రిపీట్ చేస్తాడనేది చూడాలి.



# పొట్టి డ్రెస్‌లో నభా అందాలు

ఒకప్పుడు భాషతో సంబంధం లేకుండా వరస చిత్రాలలో అవకాశాలు అందుకొని.. సడన్గా అవకాశాలు తగ్గిపోయి మళ్లీ ఇప్పుడు అవకాశాల కోసం ఎదురుచూస్తున్న హీరోయిన్స్ లో నభా నటేష్ కూడా ఒకరు. ముఖ్యంగా అవకాశాల కోసం ఎదురుచూడడంలో భాగంగానే సోషల్ మీడియా వేదికగా అందాలు వలకబోస్తూ అభిమానులను అటు దర్శక నిర్మాతలను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా బ్లాక్ కలర్ పొట్టి డ్రెస్ ధరించి.. అందాలు ఆరబోస్తూ అభిమానులను అలరించే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. బ్లాక్ కలర్ మినీ టాప్ అండ్ షార్ట్ తో నడుము అందాలను హైలెట్ చేస్తూ షేర్ చేసిన ఫోటోలు ఇంస్టాగ్రామ్ లో మంట రాజేస్తున్నాయి. మొత్తానికైతే ఈ మధ్యకాలంలో గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నభా నటేష్ మరోసారి తన అందాలతో మెస్మరైజ్ చేస్తోంది. ప్రస్తుతం ఈమె ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఫోటోలకు అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా నభాకి అవకాశాలు వస్తాయేమో చూడాలి. నన్ను దోచుకుందువటే అనే సినిమా ద్వారా హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమయ్యింది ఈ ముద్దుగుమ్మ..
సుధీర్ బాబు హీరో గా వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. 2018లో వచ్చిన ఈ సినిమా కంటే ముందే కొన్ని కన్నడ సినిమాలలో కూడా నటించింది. ఇక పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయింది. ఇందులో తన అందంతో నటనతో మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఈ సినిమాలో గ్లామర్ తో ఆకట్టుకోవడంతో ఆ తర్వాత కొన్ని సినిమాలలో అవకాశాలు లభించాయి. అలా డిస్కో రాజా, అదుగో, అల్లుడు అదుర్స్, సోలో బ్రతుకే సో బెటర్, మాస్ట్రో ఇలా తదితర సినిమాలలో నటించి అభినయంతో మంచి మార్కులు వేయించుకుంది.



# గ్లామర్ డోస్ పెంచేసిన జూ.సమంత

ఆషు రెడ్డి.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో జూనియర్ సమంతగా తనకంటూ ఒక పేరును సొంతం చేసుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ఫోటోలు షేర్ చేసే ఈమె.. తాజాగా మరో ఫోటోషూట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ముఖ్యంగా బ్లేజర్ ను తలపించేలా గోల్డెన్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె.. అందులో తన అందాలు చూపిస్తూ బ్లాస్ట్ చేసింది. ముఖ్యంగా అందాలే హైలెట్ గా షేర్ చేసిన ఈ ఫోటోలకు కుర్రకారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిజానికి ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఇలా గ్లామర్ షో చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది ఆషు రెడ్డి. దీనికి తోడు ఇప్పుడు మరొకసారి అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ అమ్మడు అందాలతోనే అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆషు రెడ్డి తెలుగు నటి మాత్రమే కాదు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గా కూడా భారీ పాపులారిటీ అందుకుంది. ముఖ్యంగా బిగ్ బాస్ తెలుగు సీజన్ 3 తో పాటు బిగ్ బాస్ ఓటీటీ నాన్ స్టాప్ లలో కూడా పాల్గొని మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది.

అందం , ఫ్యాషన్, టాలెంట్ తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటూ పలు ఇంటర్వ్యూలు , ఫోటోషూట్లతో పాటు సినిమాలలో కూడా నటిస్తూ మరింత బిజీగా మారిపోయింది. ఇంస్టాగ్రామ్ వేదికగా మిలియన్ల కొద్ది ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈమె ఆ సంఖ్యను మరింత పెంచుకోవడానికి తరచూ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ నిత్యం ట్రెండింగ్ లో నిలుస్తోంది.

# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం



నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని వాళ్లు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇక అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం. శిరీష్–నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్– లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 'మా పరిచయం ఎలా మొదలైందంటూ ఏదోఒక రోజు మా పిల్లలు అడిగితే ఇదే చెబుతా. నన్ను తమ సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ థాంక్స్' అని చెప్పారు.

# బడ్జెట్ పెరగడంతోనే టిక్కెట్ల రేట్లు పెరుగుదల

## నిర్మాత నాగవంశీ వెల్లడి



సినిమా బడ్జెట్ ఆధారంగానే టికెట్ ధరలు పెంచుతున్నామని ఎవరినీ దోచేయడానికి కాదని నిర్మాత నాగవంశీ చెప్పారు. తాము బతికేదే ఇండస్ట్రీ మీద అని అలాంటప్పుడు టికెట్ ధరలు పెంచి ప్రేక్షకులు థియేటర్‌లకు రాకుండా ఎందుకు చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన టికెట్ ధరల గురించి ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కొన్ని సినిమాలకు టికెట్ ధర రూ. 99 నిర్ణయించారు. ఆ చిత్రాలు చిన్నవి కాబట్టి వాటికి ఆ ధర పెట్టినా కూడా బ్జడెట్‌కు సరిపడా ఓపెనింగ్స్ వచ్చేస్తాయి. అలాగే రూ. 100కోట్లు, రూ. 500కోట్లు ఖర్చుపెట్టి తీస్తున్నప్పుడు దాని ప్రకారం టికెట్ రేట్లు పెంచుతాం. అంత భారీ చిత్రాలకు కూడా రూ. 99 ఉంటే సంవత్సరం ఆడితేగానీ రికవరీ అవ్వదు. ఇది సింపుల్ టాపిక్ దాన్ని చాలా పెద్దది చేసి మాట్లాడుతున్నారు. జనాలను దోచేయాలని నిర్మాతలెవరూ అనుకోరు. బ్జడెట్ ఎక్కువ ఉన్నవాటికి మాత్రమే ధరలు పెంచుతున్నామని అందరూ అర్థం చేసుకోవాలని అన్నారు. సినిమా ప్రచారాల గురించి నాగవంశీ మాట్లాడుతూ.. 'సానుభూతి చూపిస్తే హిట్ అవుతుందనే అబద్ధం. అలాంటి జిమిక్కుల వల్ల ఒకటి, రెండు సినిమాలు హిట్ అవుతాయేమో కానీ ప్రతి దానికి అవి పనిచేయవు. ప్రచారంలో మాట్లాడిన మాటలు చూసి వచ్చేలా జనాలు లేరు. కథ బాగుంటే ప్రేక్షకులు ఎలాగైనా చూస్తారు. 'లిటిల్ హార్ట్స్' చిన్న చిత్రమే అయినా పెద్ద విజయం సాధించింది కదా.. ఒక మూవీని తొక్కేస్తున్నారు అనేది కూడా వాస్తవం కాదు. హిట్ చేయాలా లేదా అనేది పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది' అని నాగవంశీ చెప్పారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

## క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం, అత్యుత్తమ శిక్షణ ప్రభుత్వ లక్ష్యం

**క్రీడలలో ఆంధ్రను అగ్రగామిగా నిలిపేందుకు క్రీడాకారులు కృషి చేయాలి**

**ఎంపీ కేశినేని శివనాథ్**



**విజయవాడ:** క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడా శిక్షణను అందించడంతో పాటు ప్రతిభకు ప్రోత్సహం అందించి జాతీయ అంతార్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని క్రీడా రంగంలో మరింత రాణించాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. సాంకేతిక విద్యశాఖ అధ్వర్యంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కృష్ణా రీజియన్ చెస్, కబాడి, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాట్మింటన్, రన్నింగ్, కోకో పోటీలను సోమవారం ఎం.పి. కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ రావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.పి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ క్రీడా విధానంలో తీసుకువచ్చిన మార్పుల కారణంగా రాష్ట్రంలోని క్రీడాకారులు మరింత ఉత్సహంగా క్రీడా రంగంవైపు అడుగులు వేస్తున్నారన్నారు. క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సహాన్ని అందించి అత్యుత్తమ క్రీడా శిక్షణను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహించే స్థాయికి క్రీడా ప్రాంగణాలను స్టేడియంలను అభివృద్ధి చేసి క్రీడాకారులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మారుమూల గ్రామాలలో క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గ్రామీణ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నామన్నారు. క్రీడాకారులతో పాటు కోల్లకు గౌరవం ఇచ్చి ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుర్థులలో క్రీడల పట్ల ఆసక్తి పెంపచడంతో పాటు పోటీతత్వం ద్వారా అత్యుత్తమ క్రీడాకారులను గుర్తించేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడుతాయని ఎం పి కేశినేని శివనాద్ అన్నారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. హైదరాబాద్ నగరంలో ఆసియా క్రీడలతో పాటు అనేక అంతర్జాతీయ క్రీడలను నిర్వహించే స్థాయిలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో అదే స్థాయిలో క్రీడా ప్రాంగణాలను నిర్మించాలనదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాఠశాలలు, కళాశాలలో ఆటల పోటీలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా క్రీడాల అభివృద్ధితో పాటు మానసిక శారీరక వికాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడలలో రాణిస్తూ విజయవాడ నగరానికి గుర్తింపు తెస్తున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని క్రీడలలో రాణించాలని శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు అన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నికల్ రీజనల్ జయింట్ డైరెక్టర్ జి.వి. రామచంద్రరావు, ఎసిటిఇటి సెక్రటరీ జి.వి.వి. ఎస్. ఎన్ మూర్తి, ప్రభుత్వ పాలిటెక్నికల్ పాఠశాల ప్రిన్సిపల్ డా. ఎం విజయసారది, ఉమ్మద్ కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో నర్సీపట్నం మున్సిపాలిటీ

**బడ్జెట్‌పై చింతకాయల పద్మావతి ప్రశంసల జల్లు**



**నర్సీపట్నం:** మున్సిపాలిటీ అభివృద్ధిలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సహకారం అమూల్యమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. సోమవారం జరిగిన 2026ఉ 27 మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ బడ్జెట్ వాస్తవికంగా, సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించారని కమిషనర్ సురేంద్ర ను, చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి ని, సిబ్బందిని అభినందించారు. ప్రారంభ నిల్వ రూ.10.36 కోట్లు కాగా, ఆదాయం రూ.34.34 కోట్లు, ఖర్చు రూ.42.30 కోట్లు, ముగింపు నిల్వ రూ.2.40 కోట్లుగా బడ్జెట్ అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అంకెల గారడీతో బడ్జెట్లు ఉండేవని, కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని అన్నారు. స్పీకర్ చొరవతో విఎంఆర్డిఏ నిధుల ద్వారా రూ.9.11 కోట్లతో 107 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉత్తరవాహిని వద్ద కల్యాణ మండపం, స్కేటింగ్ రింక్ మరమ్మతులు, క్రీడా మైదానాల అభివృద్ధి, పారిశుధ్య వాహనాల కొనుగోలు, డంపింగ్ యార్డ్ చెత్త శుద్ధి, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, స్మశాన వాటికల అభివృద్ధి వంటి అనేక పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.అలాగే రాబోయే మూడు నెలల్లో పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించే విధంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అన్ని పార్టీల కౌన్సిలర్లు కలిసికట్టుగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కౌన్సిలర్ పద్మావతి పిలుపునిచ్చారు.

## వివేకానంద డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



**చల్లపల్లి:** స్థానిక శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, చల్లపల్లి రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ నిర్వహణలో సోమవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. తహసీల్దార్ డి.వనజాక్షి ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేం దుకు స్వచ్ఛందంగా ముందుకువచ్చిన యువతను అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, రక్తదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనీ, రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. రక్తదాన శిబిర నిర్వహణకు సహకరించిన కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ను రెడ్ క్రాస్ సంస్థ తరపున ఘనంగా సన్మానించారు. పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్బ్యాంకు వైద్యులు డాక్టర్ హనుమంతయ్య విద్యార్థులను పరీక్షిం చారు. ఆర ఘంటసాల కృష్ణమోహన్, రెడ్ క్రాస్ సబా బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్బాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి పి.శం కర్, రెడ్ క్రాస్ ప్రతినిధులు టి.సాంబశివరావు, బళ్లా మదుసూధనరావు, ఆకురాతి హరిప్రసాద్, పెనుమూడి శ్రీనివాసరావు, ఆకుల సుధీర్ కుమార్, హెచ్ఎఫ్ సి బ్యాంకు ప్రతినిధి ప్రవీణ్ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

# ఉర్దూ భాష మనందరి భాష

**స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రభావితం చేసిన 'ఉర్దూ'**

**ఉర్దూ భాషాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు అమలు చేస్తున్నాం**

**రాష్ట్రంలో ద్వితీయ అధికార భాషగా ఉర్దూ అమలు**

**భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే**

**ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ సభలో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**విజయవాడ:** ఉర్దూ భాష మనందరి భాష అని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకను 'సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్' పేరుతో సోమవారం నిర్వహించారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారుక్ షుబ్లీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ భారతీయ భాషల్లో ఉర్దూ భాషకు ఎంతో చారిత్రాత్మక, విశిష్టత కలిగిన నేపథ్యం ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించేందుకు, చైతన్యాన్ని నింపేందుకు ఉర్దూ భాష నుండి ఉద్భవించిన నినాదాలు, కవితలు, గేయాలు, పద్యాలు అత్యంత కీలకపాత్ర పోషించిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. ఉద్యమ కాలంలో హస్రత్ మొహాని, రాంప్రసాద్ బిస్మిల్, మహమ్మద్ ఇక్బాల్, గాలిబ్ లాంటి ప్రముఖుల నుండి జాలువారిన ఉర్దూ కవితలు స్వాతంత్ర్య ఉద్యమాన్ని తీవ్ర ప్రభావితం చేశాయని అన్నారు. భాషలను మాట్లాడకపోయినా, నేర్చుకోకపోయినా అంతరించిపోయే ప్రమాదం ఉందని, భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధి కోసం 50 సంవత్సరాల క్రితం ప్రత్యేకంగా అకాడమీ ని స్థాపించి, రెండవ అధికార భాషగా గుర్తిస్తూ అమలు చేయడానికి పునాది వేయడం జరిగిందన్నారు. ఉర్దూ ఒక మతానికి చెందిన భాష కాదని, ముస్లింలే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సింధీలు, సిక్కులు, హిందువులు కూడా ఉర్దూను ఎక్కువగా మాట్లాడతారని అన్నారు. ఉర్దూ భాషలో భావోద్వేగం, గాంభీర్యం, కవితా సౌందర్యం ఇలాంటి ఎన్నో విశిష్టతలు మిళితమై ఇమిడి ఉన్న విషయాన్ని మంత్రి ఫరూక్ వివరించారు. అందువల్ల ఉర్దూ భాష లాంగ్వేజ్ ఆఫ్ లవ్ గా పిలువబ డుచున్నదని మంత్రి తెలిపారు. ఉర్దూ భాషను మనందరి భాషగా ముందుకు తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలను అమలు చేస్తున్నదని అన్నారు. దేశంలోని ప్రథమ ఉర్దూ యూనివర్సిటీ- మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్ అలాగే రాష్ట్ర విభజనానంతరం కర్నూల్ లో వెలసిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి విశేష కృషి వల్లనేనని మంత్రి కొనియాడారు. ఉర్దూ పాఠశాలలు, హాస్టళ్లు, ఉర్దూ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఉర్దూ లైబ్రరీలు, పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ లాంటి ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ ఆవిర్భవించి 50 సంవత్సరాలైన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందనిఅకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ పేర్కొన్నారు. సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ పేరుతో వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూను ద్వితీయ భాషగా మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికా బద్ధమైన చర్యలను ప్రజలకు వివరించేందుకు వారోత్సవాలలో ముఖ్య ఎజెండాతో సమావేశాలు నిర్వహించడం జరిగిందని షుబ్లీ పేర్కొన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్ తదితరులు సర్వోత్సవ సభలో ప్రసంగించారు. ఆ తరువాత, దేశం నలుమూలలనుండి వచ్చిన కవులు నిర్వహించిన ఉర్దూ ముషాయిరా అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున ఉర్దూ భాషాభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

**ముక్కోటి ఏకాదశి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి**

**చిన్న అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా చూడాలి**

**సంయుక్త బృందాలు తనిఖీలతో పర్యవేక్షణ చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ:** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మానవ సేవయే మాధవ సేవ అనే విషయాన్ని గుర్తెరిగి భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకునేలా చూడాల న్నారు. ముఖ్యంగా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు, ప్రసాదాల పంపిణీ, వైద్య సేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకు కూడా తావులేకుం డా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. క్యూలైన్లు, బ్యారికేడింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమన్వయ శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. చిన్నపాటి తప్పిదం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలన్నారు. ఎస్‌వోపీని అనుసరిస్తూ చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని ఏర్పాట్లు ఉన్నాయో లేదో చూసుకొని ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. ఆలయ ఈవోలు.. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. క్రమ శిక్షణ పాటిస్తూ దర్శనాలు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ ఎన్.షణ్ముగం, ఆర్‌డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, వివిధ శాఖల అధికారులు, ఆలయాల ఈవోలు పాల్గొన్నారు.

# సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద డేగ కన్ను

**సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా**

**యూరియా పక్కదారి పడితే సస్పెన్షన్ వేటే**

**నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు**

**ఎరువుల నియంత్రణ చట్టం (1985) ప్రకారం కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరిక**



**విజయవాడ:** జిల్లాలో యూరియా అక్రమ రవాణా, నిల్వలు, పక్కదారి మళ్లింపులను అరికట్టేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందని, సమన్వయ శాఖలు క్రియాశీలంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. జిల్లాలో యూరియా పంపిణీ ప్రణాళిక, పక్కదారి పట్టకుండా తీసుకుంటున్న చర్యలు, రైతులకు నాణ్యమైన సేవలు అందించడంపై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఆర్‌డీవోలు, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గత అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 17,707 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని.. వచ్చే మూడు రోజులకు 339 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ప్రస్తుతం 5,236 మెట్రిక్ టన్నుల యూరియా కోఆపరేటివ్ సొసైటీల్లో, మార్క్‌ఫెడ్ గోదాముల్లో, రిటైల్/హోల్‌సేల్ తదితరాల చోట్ల అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, రైతులు ఎరువులను కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా డీలరు నుంచి రసీదు పొందాలని సూచించారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినా, కృత్రిమ కొరత సృష్టించినా, పక్కదారి పట్టించినా, ఎంఆర్‌పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా వారి లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎరువుల నియంత్రణ చట్టం (1985) ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని.. రైతులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించినా, నిబంధనలు ఉల్లంఘించినా సస్పెన్షన్ తప్పదని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల స్థాయిలో పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని, సమన్వయ శాఖల అధికారుల బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎరువులు, నానో ఎరువుల వినియోగంపైనా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్త ఏడాదిలో నూతనుత్తేజంతో పనిచేద్దాం

**సమష్టి భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుకండి**

**ఉద్యోగుల సమస్యలపై పూర్తి స్పష్టత ఉంది**

**ఏపీ ఎన్‌జీజీవో నేతలతో, ఏపీ జేఏసీ నేతలతో ముఖ్యమంత్రి**



**అమరావతి:** కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో నూతనుత్తేజంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా పనిచేద్దామని.. సమష్టి భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏపీ ఎన్‌జీజీవో, ఏపీ జేఏసీ నేతలతో అన్నారు. సోమవారం ఏపీ ఎన్‌జీజీవో, ఏపీ జేఏసీ నేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంఘ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘ క్యాలెండర్, డైరీలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జేఏసీ నేతలు అందరి ముందు ఎన్జీవో సంఘ నాయకుల ముందు డైరీను, క్యాలెండర్ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహనతో పాటు స్పష్టమైన దృష్టి ఉందని, దశలవారీగా అన్ని అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తూనే ఉద్యోగుల హక్కులను కాపాడే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధిని వేగవంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికాయుతమైన కృషికి ఉద్యోగ సంఘాల చొరవను జతచేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఏపీ ఎన్‌జీజీవోస్ అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ఎన్‌జీజీవోస్, ఏపీ జేఏసీ కీలకభాగస్వామ్యం అవుతుందని.. ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామని, ఉద్యోగుల సమస్యలు, ఆకాంక్షలు కూడా నూతన సంవత్సరంలో నెరవేరుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోగులకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలను ముఖ్యమంత్రి దగ్గర ఏపీ జెఏసి చైర్మన్ విద్యాసాగర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఉపాధ్యాయ సంఘాలు, ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయు సంఘ, పెన్షనర్స్ సంఘ డైరీలోను క్యాలెండర్ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏపీ ఎన్‌జీజీవో జనరల్ సెక్రటరీ డీవీ రమణ, ఏపీ యూటీఎఫ్ ప్రెసిడెంట్ నక్కా వెంకటేశ్వర్లు, ఏపీ ఎస్‌టీయూ ప్రెసిడెంట్ ఎం.రఘునాథరెడ్డి, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (257) ప్రెసిడెంట్ జి.హృదయరాజు, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (1938) ప్రెసిడెంట్ సీహెచ్ మంజుల, ఏపీపీటీడీ (ఎన్ఎంయూ అసోసియేషన్) ప్రెసిడెంట్ వై.శ్రీనివాస్, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వెంకటేశ్వర్లు, ఏపీ సీపీఎస్ ప్రెసిడెంట్ కె.సతీష్, ఏపీ గ్రామ వార్డు సచివాలయం ప్రెసిడెంట్ జానీ పాషా, ఏపీపీఏవో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ హరనాథ్, ఏపీ ఇరిగేషన్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, ఏపీ క్లాస్ 4 అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.చంద్రశేఖర్, ఏపీ వెటర్నరీ ఫెడరేషన్ బి.సేవా నాయక్, ఏపీ ఏఈవోఎస్ ప్రెసిడెంట్ వేణుమాధవ్, ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, ఏపీఆర్ఎస్‌వో ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చదువులో మర్మం గ్రహించే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులవుతారు

**ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**



**చల్లపల్లి:** చదువులో మర్మం గ్రహించే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులవుతారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతూ త్వరలో పబ్లిక్ పరీక్షలకు హాజరు అయ్యేందుకు సిద్ధం అవుతున్న 800మంది టెన్త్ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు విద్య మాత్రమే సాధనమన్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. గత ఏడాది అత్యధికముగా 92శాతం మంది ఉత్తీర్ణులు అయ్యారని, ఈ ఏడాది ప్రతి విద్యార్థి పాస్ కావాలన్న ధ్యేయంతో నియోజకవర్గంలోని టెన్త్ విద్యార్థులకు సబ్జెక్ట్ నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తులు గ్రామాల నుంచే వచ్చారని, విద్యార్థులు తమ గ్రామం నుంచి ఎదిగిన గొప్ప వ్యక్తుల గురించి తెలుసుకుని, వారి స్ఫూర్తితో ఎదగాలని సూచించారు. పేదరికాన్ని విద్యతో జయించి ప్రపంచ మేధావుల్లో ఒకరిగా ఖ్యాతి పొందిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, చల్లపల్లిలో చదువుకున్న ప్రముఖ వైద్యులు కాకర్ల సుబ్బారావు, పెద్దకళ్లేపల్లిలో పుట్టిన యార్లగడ్డ గ్రామ కరణం కుమారుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, మంగళాపురం పుట్టి పెరిగి, అంతర్జాతీయ శాంతి అవార్డులు అందుకున్న చంద్ర రాజేశ్వరరావు లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మన పేరు పాఠ్య పుస్తకాల్లో ఎక్కే స్థాయికి ఎదగాలనే ఆకాంక్షతో చదివితే ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ ఉత్తమ ఫలితాలు అందుకుంటారని తెలిపారు. సబ్జెక్ట్ నిపుణులతో శిక్షణ ఇచ్చి విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి యూవీ.సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది కృష్ణాజిల్లా టెన్త్ ఫలితాల్లో స్టేట్ టాప్-5లో నిలిపే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్జెక్టు నిపుణులు షాజా బేగం, కే.వాహిని, ఝాన్సీ లక్ష్మిభాయ్, టీ.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ఆర్.రత్నగిరి, యేసుపాదం, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర రావు విద్యార్థులకు తమ సబ్జెక్ట్ వారీగా శిక్షణ ఇచ్చి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి సత్కరించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యేను ఎంఈఓలు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), ఎంఈఓలు జీ.ఎన్.బీ.గోపాల్, ఎన్.శివశంకర్, కందుల సుజాత, పీ.వెంకటేశ్వరరావు, మోమిన్, సనకా శ్రీకాంత్, ఆలా వెంకటరమణ, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, విశ్రాంత హెచ్ఎం జీవీ తాతారావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కట్టుదిట్టమైన ఆంక్షలు

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

**పేట ప్రజలకు సీఐ ఎం.మురళీకృష్ణ సూచన**



**సూళ్లూరుపేట:** కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న పట్టణ ప్రజలు, యువత నూతన సంవత్సరం వేడుకలను పోలీసు నిబంధనలకు లోబడి నిర్వహించాలని సీఐ ఎం.మురళీకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏ చర్యనైనా సహించబోమని హెచ్చరించారు. న్యూ ఇయర్ ఈవెంట్లు నిర్వహించదలచిన వారు ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, వేడుకల ప్రాంగణాల్లో సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. తిరుపతి జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం వేడుకల్లో రాత్రి 10 గంటల తర్వాత మ్యూజిక్ సిస్టమ్స్ వినియోగించరాదని సీఐ స్పష్టం చేశారు. అదే విధంగా రాత్రి వేళ పోలీసుల వాహన తనిఖీలు నిర్వహిస్తామని, అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో ముఖ్యమైన జంక్షన్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హోర్డింగ్స్, మ్యాగజైన్స్, పోస్టర్లలో అశ్లీలత కలిగిన ప్రకటనలు పూర్తిగా నిషేధమన్నారు. వేడుకల సమయంలో అశ్లీల నృత్యాలు, చర్యలు, సినిమాలు, సంజ్ఞలకు ఎలాంటి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఔట్‌డోర్ కార్యక్రమాల్లో డీజే సౌండ్ బాక్సులు, పటాకులు కాల్చడానికీ అనుమతి నిరాకరిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బైక్‌ల సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దంతో రోడ్లపై ప్రయాణించరాదన్నారు. బైక్ రేసర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువత, రోడ్లపై చిందులు తొక్కే మందుబాబులను గుర్తించేందుకు వీడియో, డిజిటల్ కెమెరాలతో చిత్రీకరిస్తామని సీఐ తెలిపారు. మహిళలపై ఎలాంటి వేధింపులు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. శాంతిభద్రతలు భంగం కలగకుండా ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను నియమిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటిస్తూ అందరూ ఆనందంగా, సురక్షితంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు.

# చెంగాళమ్మ కృపతో నూతన సంవత్సరానికి శుభారంభం

**అమ్మవారి 2026 క్యాలెండర్ ఘన ఆవిష్కరణ**



**సూళ్లూరుపేట:** శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులమీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాబోయే 2026 నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. అలాగే చెంగాళమ్మ అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ సంప్రదాయాలు, ఆచారాలు మరింత బలోపేతం కావాలని, భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సుకు ఈ ఆలయం కేంద్రబిందువుగా నిలవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలి



**నాయుడుపేట:** విశాఖపట్నంలో ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగునున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద అన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ నుండి మార్కెట్ సెంటర్ వరకు సోమవారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1970లో ఏర్పడిన సిఐటియు 70 తర్వాత రెండవ దశ కార్మిక ఉద్యమంలో సిఐటియు పాలకవర్గాల నుంచి తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొందన్నారు. నిర్బంధ నుంచి సిఐటియు దేశంలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించిందని తెలిపారు. 1974లో చారిత్రాత్మక రైల్వే పోరాటాన్ని నిర్వహించి,కాంట్రాక్టు కార్మికులు రద్దు చట్టం నుంచి వలస కార్మికుల చట్టం వరకు హక్కులతో కూడిన అనేక చట్టాలను సాధించిందని చెప్పారు. 1991 తరువాత సరళీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ఛాంపియన్ గా నిలిచిందని అన్నారు. జాతీయ సమ్మెలలో చురుకైన పాత్ర నిర్వహించిందని తెలిపారు. ఈ మహాసభను కార్మిక,కర్షక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆటో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్ రెడ్డి సతీష్ మాట్లాడుతూ బండికి అన్ని పేపర్లు ఫోర్సులో ఉన్న బండి కండిషన్లో ఉన్న ప్రభుత్వ రాబడి కోసం పోలీసులు అనేక రకమైన కేసులు పెట్టి ఫైన్ లు వేస్తూ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ కాలేషా, శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులకు ఆప్కాస్ లో లేని కార్మికులను అప్కాస్ లో చేర్చి,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 1987 నుండి ఇప్పటివరకు పెర్మనెంట్ కానీ కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారిని పెర్మనెంట్ చేయాలని కోరారు. డ్యూటీలో చనిపోయినటువంటి కార్మికుల కుటుంబ సభ్యులను ఆప్కాస్ లో తీసుకోవాలని, నల్ల చట్టాలను రద్దు చేయాలని, లేబర్ కోర్స్ రద్దు చేయాలని అన్నారు ఎస్.కె అబ్దుల్లా మాట్లాడుతూ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పరిశ్రమలలో పని చేస్తున్నటువంటి కార్మికులకు ఉద్యోగ భద్రత,కనీస వేతనం,పిఎఫ్ వి ఎస్ ఐ,బోనస్,అరియర్స్ సేఫ్టీ పరికరాలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై లేబర్ అధికారులు పరిశ్రమలపై తనిఖీలు నిర్వహించి చట్ట ప్రకారం రావలసిన రాయితీలన్నీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, ముని రాజా, రామచంద్రయ్య,శ్రీధర్, పలువురు సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిసిన టీడీపీ జిల్లా కోశాధికారి నాదెళ్ల నాగమణి



**విజయవాడ:** తెలుగుదేశం పార్టీ జిల్లా కోశాధికారిగా నియమితులైన తిరువూరు నియోజవర్గానికి చెందిన నాదెళ్ల నాగమణి మర్యాద పూర్వకంగా ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ ను ఆమె టిడిపి మహిళ నాయకులతో కలిసి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఆమెకు అభినందనలు తెలిపారు. జిల్లాలో టిడిపి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళ నాయకులు దొంతు హైమవతి, మట్టా ఉషా, కొలికపోగు రామకోటమ్మ పాల్గొన్నారు.

# రైతులకు యూరియా బస్తాల పంపిణీ



**నాయుడుపేట:** పెళ్లకూరు మండల పరిధిలోని తాళ్వాయిపాడు పంచాయతీలో సోమవారం కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందిస్తున్న యూరియా బస్తాలను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంల ఆదేశాల మేరకు నాయుడుపేట ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ యాదవ్, చిల్లకూరు పిఎసిఎస్ డైరెక్టర్ పెళ్ళాకూరు గోపాలకృష్ణ లు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు అవసరమైన యూరియా బస్తాలను సకాలంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి సిబ్బంది రాహుల్, నాయకులు బాలయ్య,భాస్కర్, గంగాబత్తిన శ్రీనివాసులు, కన్నడి శ్రీనివాసులు, కర్పూరం వెంకటాచలపతి, వేంపల్లి వెంకటేశ్వర్లు, నెలవల ప్రసాద్, ముసునూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.